విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక



టీవీ రిపోర్టర్లు కావలెను
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 02-07-2025 | సంపుటి : 11 | సంచిక : 154 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# ఆ విధ్వంసాన్ని నా జీవితంలో చూడలేదు: సీఎం చంద్రబాబు



రాజమండ్రి, జులై 1: పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని.. ఈ కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వటం వల్ల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదని విమర్శించారు. వైసీపీలో జరిగిన విధ్వంసాన్ని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నూటికి 13 మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొచ్చారు.సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని అన్నారు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతామని' వెల్లడించారు. పెరిగిన ఆదాయం పేదలకు పంచి అభివృద్ధికి ఖర్చు పెడతామని చెప్పుకొచ్చారు. తన తల్లి పడిన కష్టం ఏ మహిళకూ ఉండకూడదని ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు చంద్రబాబు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.పింఛన్లు ఇచ్చేటప్పుడు ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో పేదవారిని చులకనగా చూస్తే సహించనని హెచ్చరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టపడుతున్నానని తెలిపారు. మానవత్వంతో దివ్యాంగుల కోసం 12 రెట్లు పింఛన్లు పెంచామన్నారు. రాజకీయ ముసుగు వేసుకొని ప్రజాధనాన్ని దోచుకుంటే సహించనని వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీయే కార్యకర్తలు దగ్గరుండి మరీ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పరిశీలించాలని ఆదేశించారు. 'డ్రగ్స్, గంజాయి విక్రయించే వారి తాట తీస్తా. ఆడబిడ్డపై చేయివేసే వారికి అదే చివరి రోజు. రౌడీయిజాన్ని సహించను' అని తీవ్రంగా హెచ్చరించారు సీఎం.నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. 'సాధారణ కుటుంబంలో పుట్టి దేవుని కృప వల్ల అంచెలంచెలుగా అభివృద్ధి చెందాం. డాక్టర్ అంబేద్కర్ సాధారణ కుటుంబం నుంచి జన్మించి తరతరాలు గుర్తుండే రాజ్యాంగాన్ని రచించారు. లక్ష బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. రూ.10లక్షల కోట్ల అప్పులు తీర్చాలని' అన్నారు. పోలవరాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని 2027కి పూర్తి చేసే అదృష్టం దేవుడు తనకే ఇచ్చారన్నారు. డిసెంబర్ నాటికి డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. గోదావరి పుష్కరాలు మూడోసారి తానే చేయబోతున్నానని.. కనీవినీ ఎరగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.రాజకీయాల్లోకి రౌడీలు వస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. పాయకరావుపేట హాస్టల్‌లో సరిగ్గా భోజనం పెట్టని ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. వివేకా మృతిపై ఆయన కుమార్తె అనుమానం వ్యక్తం చేస్తే గొడ్డలి పోటుగా నిర్ధారించామని అన్నారు. రౌడీషీటర్‌ను పలకరించటానికి జగన్ వెళ్లి రౌడీయిజం చేశారని ఫైర్ అయ్యారు. జగన్ కారు కిందపడి చనిపోతే కుక్కను లాగినట్టు పక్కన లాగి పాడేశారన్నారు. 'నా జీవితంలో నేను ఎక్కడా ఎవర్ని కొట్టలేదు, నాపై కేసులు లేవు. ప్రజలను కాపాడేందుకు నేరస్తులతో రాజకీయ పోరాటం చేస్తున్నా. నేరస్తులకు ఓటు వేసి గెలిపిస్తారా' అని సీఎం ప్రశ్నించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆగస్టు 15 నాటికి నూరు శాతం సేవలు అందిస్తామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.30వేలు పెంచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన..
### మూడు రోజులు వానలే వానలు..



హైదరాబాద్, దేశ వ్యాప్తంగా పలు చోట్ల ఇటీవల కొన్ని రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక, తెలుగు రాష్ట్రాల్లో నిన్నటి నుంచి పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉత్తరబంగాళాఖాతం, ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో మరో మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.తెలంగాణలోని 19 జిల్లాల్లో 3 రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం కూడా ఉందని ప్రకటించింది. ఇక, ఏపీలోనూ మరో మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఏపీలోని శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని .. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందనివాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసింది.

## వారి కళ్లలో ఆనందమే మా సంతోషం: మంత్రి నారాయణ


నెల్లూరు, జులై 1: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలోని మన్సూర్ నగర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంత్రి నారాయణ ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నెలా 1వ తేదీ పెద్ద పండుగలా పింఛన్ల పంపిణీ సాగుతుందని తెలిపారు. ఏపీలో 67 లక్షల మంది కళ్లలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్ల పంపిణీకి ఖర్చు చేస్తున్నామని.. త్వరలోనే రైతులకు రూ.20 వేలు అందిస్తామని వెల్లడించారు. అలాగే ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందన్నారు. తామిచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి తీరుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, క్రమం తప్పకుండా రూ.4 వేలు చొప్పున పింఛన్లు పంపిణీ




చేస్తున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీలో చరిత్ర సృష్టించారన్నారు. వైసీపీ చెడు ఆలోచనలతో తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మంత్రి నారాయణ రేయింబవళ్లు శ్రమిస్తున్నారని.. ఆయన జిల్లా మంత్రిగా ఉండటం అందరి అదృష్టమని ఎంపీ వేమిరెడ్డి కొనియాడారు.పింఛన్ల పంపిణీ అనంతరం నగరంలోని ఆర్ఎస్ఆర్, వీఆర్ స్కూళ్లను ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ పరిశీలించారు. అలాగే వీఆర్ హైస్కూల్ పిల్లలకు కొద్దిసేపు పాఠాలు భోదించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..'నేను ఋుషీవ్యాలీ స్కూల్‌లో చదివా. అంతకంటే గొప్పగా వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దారు. రూ.లక్షకి పైగా ఫీజులు చెల్లిస్తే కానీ అందని కార్పోరేట్ విద్యని పేద పిల్లలకు ఉచితంగా అందించడం సంతోషం. మూతపడ్డ స్కూల్‌ను అంతర్జాతీయ స్థాయి స్కూల్‌గా తీర్చిదిద్దడం సాధారణ విషయం కాదు. 1050 సీట్లు ఉంటే, 5 వేల దరఖాస్తులు వచ్చాయి.

## బనకచర్లపై తమ వాదనతో ఏకీభవించిన కేంద్రం

హైదరాబాద్, జులై 01: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు.గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.



## ఏపీ, తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్‌లకు సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ విషెస్



అమరావతి, జులై 1: ఆంధ్రప్రదేశ్ బీజేపీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. పరస్పర సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడదామని ఎక్స్‌లో సీఎం పోస్టు చేశారు. అలాగే ఏపీ, తెలంగాణ కొత్త బీజేపీ చీఫ్‌లు మాధవ్, రామచందర్ రావులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. తెలుగు జాతి అభ్యున్నతి కోసం ఇద్దరు నేతలు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.


**చంద్రబాబు ట్వీట్** 'ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. నూతన బాధ్యతల్లో మీరు రాణించాలని కోరుకుంటున్నాను. కూటమిలోని మూడు పార్టీల సమన్వయం, పరస్పర సహకారంతో రాష్ట్రాభివృద్ధికి పాటు పడదాం' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

**హృదయపూర్వక అభినందనలు: లోకేష్** 'ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు, తెలంగాణా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్ రామచందర్ రావుకు నా హృదయపూర్వక అభినందనలు. శాసనమండలి సభ్యులుగా పని చేసిన ఇద్దరూ చట్టసభల్లో తమగళాన్ని బలంగా వినిపించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై పోరాడిన అనుభవం గల ఇద్దరు నేతలు తెలుగుజాతి అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్టు చేశారు.

**పవన్ అభినందనలు**అలాగే ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్, తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్ రామచందర్ రావుకు హృదయపూర్వక అభినందనలు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన ఆయన ఎమ్మెల్సీగా ప్రజా గళాన్ని శాసనమండలిలో వినిపించారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతారని, కేంద్ర ప్రభుత్వం జాతీయ దృక్పథంతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నాను అని డిప్యూటీ సీఎం అన్నారు.అలాగే ఏపీ బీజేపీ చీఫ్‌గా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు కూడా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు పవన్. విద్యార్థి దశ నుంచి రాజకీయాలలో ఉన్న మాధవ్.. శాసనమండలి సభ్యుడిగా పలు ప్రజా సమస్యలపై, యువత, నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు చట్టసభల్లో ప్రస్తావించారన్నారు. జాతీయవాద దృక్పథం కలిగిన నాయకుడని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా మాధవ్ కూటమి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

## మరోమారు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర
### కూటమి అక్రమాలను ఎండగట్టడమే లక్ష్యం
### వైసీపీ యూత్ వింగ్‌తో భేటీలో జగన్ ప్రకటన

అమరావతి,జులై 1(ఆర్ఎన్ఎ): మరోమారు రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి అధికార కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తానని వైకాపా అధినేత జగన్ ప్రకటంచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలవడానికి ప్రధాన కారణాల్లో వైఎస్ జగన్ సుదీర్ఘ పాదయాత్ర ఒకటి అని నిస్సందేహంగా చెప్పచ్చు. 3 వేల 648 కిలోమీటర్ల మేర 341 రోజులు జరిగిన ఈ పాదయాత్ర ఒక ట్రెండ్ సెట్టర్ అని చెప్పాలి. ఈ పాదయాత్రకు వచ్చిన రెస్పాన్స్ అప్పట్లో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు మళ్ళీ అదే సీన్ రిపీట్ కానుందని తెలుస్తోంది. 2029 ఎన్నికలకు ముందు మరోసారి పాదయాత్ర చేస్తానని ప్రకటించారు జగన్. మంగళవారం తాడేపల్లిలో వైసీపీ యూత్ వింగ్ తో భేటీ అయినా జగన్ ఈమేరకు సంచలన నిర్ణయం ప్రకటించారు. యూత్ వింగ్ పార్టీలో క్రియాశీలకమైందని.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర అని అన్నారు జగన్. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని.. లీడర్లుగా ఎదిగేందుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే గొప్ప అవకాశం ఉంటుందని అన్నారు జగన్. వచ్చే ఎన్నికలకు ముందు ఎలాగో తన పాదయాత్ర ఉంటుందని.. అప్పుడు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి కలుస్తానని అన్నారు జగన్. పార్టీ పెట్టిన కొత్తలో అందరూ కొత్తవాళ్లే అని..



అప్పట్లో పార్టీలో తాను, తన తల్లి మాత్రమే ఉన్నారని, తన మీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు పార్టీలోకి వచ్చారని జగన్ అన్నారు. పార్టీ పెట్టడంతోనే తన ప్రస్థానం మొదలైందని.. ఎన్ని కష్టాలు వచ్చినా.. విలువలు, విశ్వసనీయతకే పెద్దపీట వేశానని అన్నారు. రాజకీయంగా ఇబ్బందులు వచ్చినా రాజీ పడలేదని.. ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ తనకు వచ్చిందని అన్నారు. పార్లమెంటులో ప్రతి సభ్యుడూ తనవైపు చూసే పరిస్థితి ఉండేదని.. దాన్ని జీర్ణించుకోలేక తనమీద పగబట్టారని అన్నారు జగన్. 18 మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తే వాళ్లందరిచేతా రాజీనామా చేయించానని.. ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించామని అన్నారు. ఆ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ కాంగ్రెస్ కలిసి పోటీచేశాయని గుర్తు చేశారు. 2014లో 67 మందితో గెలిచామని.. గెలిచిన 67 మందిలో 23 మందిని చంద్రబాబు లాక్కున్నారని అన్నారు.

# సంపాదకీయం

**బుధవారం 02-07-2025**

## కో లివింగ్ వల్ల నేరాలు పెరుగుతున్నాయా,

తెలుగు రాష్ట్రాల్లో కో లివింగ్ కల్చర్‌పై ఆందోళన వ్యక్తమౌతోంది,అమెరికా, కెనడా లాంటి దేశాల్లో కో లివింగ్‌కు, హైదరాబాద్, బెంగళూరు, భారత్‌లోని ఇతర నగరాల్లో కో లివింగ్‌కు తేడా ఏంటి?భారత్‌లాంటి దేశాల్లో ఒకప్పుడు పరిచయంలేని అమ్మాయిలు, అబ్బాయిలు రోడ్డు మీదో, ఇంకెక్కడైనా బహిరంగ ప్రాంతాల్లోనో కలిసి కనిపించడాన్నే తప్పుగా భావించేవారు.కో ఎడ్యుకేషన్ కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుకున్నా...అమ్మాయిలు, అబ్బాయిల మధ్య స్నేహానికి, కలిసి తిరగడానికి సమాజం ఓ విభజన రేఖను ఏర్పరిచింది. ఆ పరిధిలోనే మనుషుల ఆలోచనా విధానం ఉండేది.కానీ కాలక్రమేణా పరిస్థితులు మారాయి. దిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ సిటీల్లో జీవన విధానంలో మార్పులొచ్చాయి. ఐటీ రంగం విస్తృతితో గతంలోలా ఆడ, మగ మధ్య పెద్దగా భేదాలుండటం లేదు. ఒకేచోట కలిసి పని చేయాల్సి రావడం, యువతీ యువకుల ఉద్యోగ విధులు ఒకే తరహాలో ఉండడంతో వారి ఆలోచనా విధానంలోనూ మార్పులొచ్చాయి.ఆఫీసు అవసరాల రీత్యా కలివిడిగా ఉండడం తప్పనిసరైంది. అదే సంస్కృతి జీవన విధానంలోనూ ప్రతిబింబిస్తోంది రెండు దశాబ్దాలుగా సామాజికపరంగా వచ్చిన మార్పు ఇదైతే, అదే సమయంలో ఓ మోస్తరు పట్టణాల నుంచి భారీ నగరాల దాకా అన్నిచోట్లా భారీ స్థాయిలో పెరిగిన జీవన వ్యయం.. జీవన విధానాలపై పెను ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యం నుంచి ఆవిర్భవించిందే కో లివింగ్ కల్చర్.రక్తసంబంధం, బంధుత్వం, వివాహ బంధం వంటివేమీ లేని ఓ అమ్మాయి లేదా అబ్బాయి, కొందరమ్మాయిలు లేదా అబ్బాయిలు ఒకే ఇంట్లో కలిసి ఉండడమే కో లివింగ్.ఇద్దరు ముగ్గరు అమ్మాయిలు కలిసి ఉన్నట్లుగా, ఇద్దరు ముగ్గరు అబ్బాయిలు కలిసి ఉన్నట్లుగానే, ముగ్గరు నలుగురు అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి ఒకే ఇంట్లో ఉండటం అత్యంత సహజమని, దాన్ని శారీరక సంబంధాల కోణంలో చూడాల్సిన అవసరం లేదని కో లివింగ్ సంస్కృతి గురించి తెలిసిన వాళ్లు అంటున్నారు.కలిసి ఉన్నంత మాత్రాన వారు శారీరక సంబంధాలు ఏర్పరుచుకుంటారన్న భావన సరికాదని, ఒకవేళ అలా ఏర్పరుచుకున్నా అది వ్యక్తిగత విషయంగా చూడాలని వారు అంటున్నారు.అయితే, పెళ్లి కాని అమ్మాయి, అబ్బాయి ఒక ఇంట్లో కలిసి ఉండడం తప్పన్న అభిప్రాయం మన సమాజంలో ఉంటుంది. ఈ కోణంలో చూసి, ఈ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని వీహెచ్ కోరారు.పెళ్లిచేసుకుని విడిపోవడం కన్నా, ఒక చోట కొంతకాలం కలిసి జీవించడం ద్వారా వివాహ బంధంలోకి అడుగుపెట్టాలా లేదా అన్నదానిపై నిర్ణయం తీసుకోవచ్చని భావించేవారు, హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్‌ల వంటి ఖర్చులు భరించలేనివారు కో లివింగ్ స్పేసెస్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ సహా అనేక ప్రాంతాల్లో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లు, బాయ్స్ పీజీలకు చాలా డిమాండ్ ఉంటుంది. ఇలాంటి నివాస సదుపాయాలు అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరుగా ఉంటాయి. వాళ్లు వెచ్చించగలిగే మొత్తాన్ని బట్టి సౌకర్యాలు అందిస్తుంటారు.యువతీ యువకులు, స్టూడెంట్లు, ఉద్యోగాలు చేసేవారు పీజీల్లో ఉండేందుకు ఎక్కువగా మొగ్గు చూపిస్తారు. భోజన సదుపాయంతో పాటు పీజీల్లో భద్రత ఉంటుందని భావించడం దీనికి మరో కారణం.అయితే పీజీల్లో ఉండడం ఇష్టం లేనివారు, మరింత సౌకర్యవంతంగా ఉండాలని భావించే కొందరు... ముగ్గరు, నలుగురు కలిసి సొంతంగా గదులు అద్దెకు తీసుకుని ఉంటుంటారు.ఇవి కాకుండా ఇప్పుడు కొత్తగా వ్యాప్తి చెందుతున్న సంస్కృతి కో లివింగ్.వారు ఒకే ఇంట్లో నివసించడానికి వీలుగా అవసరమైన సదుపాయాలను నిర్వాహకులు కల్పిస్తారు. ఇది సరైన విధానం కాదని, నేరాలు పెరిగే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. సైబరాబాద్ కేంద్రంగా ఈ సంస్కృతి విస్తరించిందని వీహెచ్ చెబుతున్నారు. ఐటీ రంగం ప్రభావం హైటెక్‌సిటీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గడచిన 20ఏళ్లుగా బాగా పెరిగింది. రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఇళ్ల స్థలాల ధరలు, ఇళ్ల ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి హైటెక్ సిటీ చుట్టుపక్కల పీజీల సంఖ్యా బాగా పెరిగింది. అయితే పీజీలు సౌకర్యవంతం కాదని భావించేవారికి, స్థోమత ఉన్నవారికి, ఇంట్లోనే ఉంటున్నామన్న భావన కల్పించడానికి, మరింత మెరుగైన సౌకర్యాలతో కో లివింగ్ హాస్టళ్లు అందుబాటులోకొచ్చాయి. లగ్జరీ హోటళ్లలో దొరికే సౌకర్యాలు, సేవలను ఈ పీజీల్లో కల్పిస్తున్నారు.”ఆఫీసులో కొంచెం లైక్‌మైండెడ్ అనుకున్న వాళ్లమంతా కలిసి ఒకే ఇల్లులాంటి స్పేస్‌లో ఉండటం బాగుంది. ఖర్చులూ కలిసొస్తాయి. బయట ఎక్కడో హాస్టల్లోనో, రూమ్ తీసుకుని ఒంటరిగానో ఉంటున్నామన్న ఫీలింగ్ కూడా ఉండదు” అని వరంగల్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో తన స్నేహితులతో కలిసి ఒక ఫ్లాట్‌లో ఉంటున్న ఓ యువతి చెప్పారు. ఆమె తన పేరు ప్రచురించడానికి ఇష్టపడలేదు.పెద్దగా ఖర్చుపెట్టే ఆర్థిక స్థోమత లేనివారికీ ఇది సదుపాయంగా ఉంది. కొందరు భోజన సదుపాయం కల్పిస్తుంటే మరికొందరు కామన్ కిచెన్, కామన్ లివింగ్ రూమ్, సెపరేట్ బెడ్‌రూంలో ఆడా, మగా ఒకే చోట నివసించే సదుపాయం కల్పిస్తున్నారు..భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం అమెరికా, కెనడా వంటి దేశాలకు వెళ్లేవారు ఇలా కో లివింగ్‌కే ప్రాధాన్యం ఇస్తారు. స్వదేశంలో ఉన్న పరిచయంతో పాటు, ఒకే దేశం, ఒకే ప్రాంతానికి చెందిన వాళ్లమన్న భావన కోసం, ఆర్థిక భారం తగ్గించుకోవడం కోసం నలుగురు లేదా ఐదుగురు అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే ఇంట్లో ఉంటుంటారు. వంటపని, ఇంటిపని షేర్ చేసుకుంటూ కలిసి జీవిస్తుంటారు.ఇది రహస్య వ్యవహారమేమీ కాదు. స్వదేశంలోని వారి తల్లిదండ్రులకు, బంధుమిత్రులందరికీ ఈ విషయం తెలిసేలానే ఉంటారు.

# భక్తులు నడిచే 32 కి.మీ. పరిధిలో విరివిగా లైట్లు, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు.

ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున 132 పాయింట్లలో తాగునీటి సదుపాయం

భక్తులకు సమాచారం తెలిసేలా సూచిక బోర్డులు, విశ్రాంతి కోసం 13 చోట్ల హోల్డింగ్ పాయింట్లు

అప్పుఘర్ స్నాన ఘట్టం వద్ద గజ ఈతగాళ్లు, బోట్లు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.

సీపీ, జేసీలతో కలిసి వివిధ :అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.

విశాఖపట్నం(విజయ సారథి):శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 09, 10వ తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ, దేవస్థానం, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేసి దిశానిర్దేశం చేశారు.ఈ నెల 09వ తేదీ తెల్లవారు ఝాము నుంచి 10 సాయంత్రం వరకు కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, 400 మరుగు దొడ్లు, పారిశుద్ధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని జీవీఎంసి అధికారులను ఆదేశించారు. అవసరమైన అంబులెన్సులు, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా వర్కర్లను శిబిరాల వద్ద ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చే సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, సముద్ర తీరంలో బోట్లను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా 09, 10వ తేదీల్లో మద్యం షాపులను మూయించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్.టి.సి. అధికారులకు సూచించారు. స్వామివారి కొండపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రిక పరికరాలతో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న మరుగుదొడ్లతో పాటు రహదారిలో ఉండే పాఠశాలలు, కళ్యాణ మండపాల్లోని మరుగుదొడ్లను వినియోగించుటకు చర్యలు తీసుకోవాలని, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా హోల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమాచార శాఖ, పోలీస్ శాఖ సిబ్బంది, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు కమాండ్ కంట్రోల్ వద్ద ఉండాలని సూచించారు. ఛైల్డ్ కేరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. చెట్ల కొమ్మలను తొలగించాలని, విద్యుత్ తీగలు వేలాడకుండా చూడాలని, గిరి ప్రదక్షిణ జరిగే దారిలో వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితుల్లో సహాయం కొరకు యాప్అనుకోని రీతిలో ఎవరికైనా అత్యవసర వైద్య సేవలు, గానీ ఇతర సేవలు గానీ అవసరమైతే ప్రత్యేక యాప్ ద్వారా సాయం అందించేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ చెప్పారు. అలాగే ట్రాఫిక్ మేనేజ్మెంట్ కు సంబంధించి అస్త్రం యాప్ ద్వారా సాయం పొందవచ్చని సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. సీసీ కెమెరాలు పెట్టాలని, లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వాలని సీపీ సూచించారు. తొక్కిసలాటకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సహకారం అందించాలన్నారు. పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, హనుమంతువాక, ఇసుకతోట జంక్షన్ల వద్ద తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంబులెన్సులు, నీటి ట్యాంకులు




సులభంగా మూవ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించగా... ముందస్తు సమాచారం అందించినట్లయితే చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారు. స్వచ్ఛంద సంస్థల వారు ఏర్పాటు చేసే కౌంటర్లు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈఓ త్రినాధరావు, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణ మూర్తి, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, రెవెన్యూ, దేవస్థానం, జీవిఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన వసతులతో సిద్ధమవుతున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల..!

:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.




కడప(విజయ సారథి):జిల్లాలో వెనుకబడిన తరగతుల పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో.. ఏర్పాటవుతున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయం త్వరలో నిర్వహణలోకి రానుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.మంగళవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు సంబంధిత అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల, జూ.కళాశాల వెనుకబడిన తరగతులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని త్వరలో నూతన భవనంలో సదుపాయాలు సిద్ధం చేసి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. రెండు నెలల గడువులోగా గురుకులంలో ఎలాంటి మౌళిక సదుపాయాల కొరత లేకుండా.. రోడ్లు, విద్యుత్, నీటి పైప్ లైన్, గ్రీనరీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చాలన్నారు. అన్ని విభాగాల భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని.. ఇంకనూ పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ మాధవి, డిఈ జగదీశ్వర్ రెడ్డి, డీఈవో శంశుద్దిన్, ఎస్ఎస్ఏ ఎపిసి ఎ. నిత్యానందరాజులు, కాంట్రాక్టు ఏజెన్సీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి(విజయ సారథి):శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి.ఇందులో భాగంగా సోమవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ చేపట్టారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.అదేవిధంగా జూలై 01న మంగళవారం హనుమంత వాహనంపై, జూలై 02న బుధవారం గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.జూలై 03న పార్వేట ఉత్సవంజూలై 03వ తేదీన గురువారం ఉదయం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర, అనంతరం ఉదయం 07 ? 11 గం.ల వరకు ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 ? 02 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దుమ్ర వారాహి దేవి ఒక కథ రూపంలో విశేషం భక్తుల కోసం



చంద్రగిరి(విజయ సారథి):పురాకాలంలో రాక్షస శక్తులు తమ తపోబలంతో చాలా విపరీతంగా బలపడిపోయాయి. వారు యజ్ఞాలను భంగపెట్టడం, ఋషుల తపసును ఆటంక పెట్టడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం మొదలుపెట్టారు. అప్పుడు భూమాతా భయపడి విష్ణుమూర్తిని ఆశ్రయించింది. అప్పుడే ఆయన వారాహి శక్తిని ఆవహించి, దుమ్ర రూపం దాల్చిన వారాహిగా అవతరించాడు.ఈ రూపం అత్యంత భయంకరమైనది ఎర్రటి కళ్లతో, నల్లటి పొగలా వ్యాపించే శరీరంతో, రక్త వర్ణముతో కండలు తిరిగిన శరీరం. ఆమె రాకతోనే శత్రువుల గుండెల్లో భయం పుట్టింది. ఆమె చేతిలో ధ్వజం, ఖడ్గం, త్రిశూలం వంటివి ప్రతీకలుగా ఉండేవి.ఒకసారి ధూళిపాడు అనే రాక్షసుడు యజ్ఞాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేయసాగాడు. అప్పుడు దుమ్ర వారాహి అమ్మవారు ఆ పొగలు కమ్ముకున్న యుద్ధ భూమిలో అడుగు పెట్టింది. ఆమె ఒక్క నాదం (ఘోర గర్జన) తోనే శత్రువులను ఉలిక్కిపడేలా చేసింది. అప్పుడు ధూళిపాడు అమ్మవారి చేతిలో నాశనం చెంది యజ్ఞాల పవిత్రత మళ్ళీ పునరుద్ధరించబడింది.దుమ్ర వారాహి పూజా విధానం.దుమ్ర వారాహి పూజను శత్రు నివారణ, దృష్టిదోష నివారణ, తేజస్సు, సాహసం మరియు రక్షణ కోసం నిర్వహిస్తారు.పూజా విధానం ఇలా ఉంటుంది.శుద్ధి పూజా స్థలాన్ని శుభ్రపరచి, గంగజలంత పవిత్రం చేయాలి.ఘంటారావం భగవతిని ఆహ్వానించేందుకు ఘంటా మోగించాలి.ధూప దీప నైవేద్యం ధూపం నల్లగంధం, అగరు, గుగ్గులుతో చేసిన ధూపం వేయాలి.దీపం నెయ్యితో చేసిన దీపాన్ని వెలిగించాలి.నైవేద్యం ఉల్లిపాయ లేకుండా తయారైన మిరియాల అన్నం లేదా శేషసాత్విక భోజనం.ఆలంకరణ అమ్మవారికి ఎర్ర, నలుపు రంగుల పుష్పాలతో పూజ చేయాలి.స్తోత్రాలు వారాహి అష్టోత్తర శతనామావళి లేదా దుమ్ర వారాహి స్తోత్రం.సంకల్పం శత్రు విజయం, భయం తొలగడం, ఆత్మబలానికి ప్రత్యేకంగా సంకల్పం చేయాలి.దర్పణ అర్చన అమ్మవారి ముందు అద్దాన్ని ఉంచి తనలోని నలుపు భావాలను ఆమెకు అర్పిస్తూ పూజ చేయడం విశేషం.ఈ రోజు దుమ్ర వారాహి రూపంలో అమ్మవారిని పూజించడం ద్వారా మనలోని భయాన్ని, అలసత్వాన్ని, దుష్టదృష్టిని తొలగించుకుని ఆత్మబలం, ధైర్యం, ఆత్మరక్షణ శక్తిని పొందవచ్చు అని మహా రుద్రవారహి స్వామి తెలియజేశారు.

# విశేష పంచామృతాభిషేకం

.మంత్రాలయం(విజయ సారథి):శ్రీ వరదేంద్ర తీర్థ ఆరాధన మహోత్సవ శుభ సందర్భంగా పుణెలోని స్తి వరదేంద్ర తీర్థ మూల బృందావనానికి హెచ్.హెచ్.శ్రీ స్వామిజీ విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ వరదేంద్ర తీర్థ మూల బృందవనానికి మహా మంగళారతి అనంతరం శ్రీ మూలరామ దేవర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మరియు శిష్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్.హెచ్.శ్రీ స్వామిజీ ప్రతి ఒక్కరికి ముద్రాధారణ, ఫల మంత్రాక్షతలతో ఆశీర్వదించారు.



# తిరుపతి జిల్లా తిరుచానూరు పంచాయతీలో భారీ కుంభకోణం–బిల్ కలెక్టర్ చేతిలో ప్రజాధనం స్వాహా!

తిరుపతి(విజయ సారథి):తిరుచానూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఓ ఆర్థిక కుంభకోణం వెలుగులోకి వచ్చింది. గత 14 సంవత్సరాలుగా బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ అనే వ్యక్తి, నాలుగు నెలల వ్యవధిలోనే అక్షరాల రూ. 22,42,193/– ప్రజల వద్ద నుంచి వసూలు చేసి ఆ మొత్తాన్ని తన వ్యక్తిగత ప్రయోజనాలకు దారి మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి.ప్రజల ఇంటి పన్నుల రూపంలో సేకరించిన ఈ భారీ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయకపోయి, స్వంత అవసరాల కోసం దుర్వినియోగం చేసినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా, తిరుచానూరు చుట్టుపక్కల ఉన్న భూములను కూడా అక్రమంగా ఆక్రమించినట్లు సమాచారం. ఈ వ్యవహారం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుండగా, బాధ్యత వహించాల్సిన అధికారుల తీరుపై కూడా ప్రశ్నలు లేవబడ్డాయి.ప్రస్తుతం ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థాయిలోనే ఇలాంటి అవినీతికీ తావిచ్చే తీరును సహించబోమని వారు హెచ్చరిస్తున్నారు.

# మళ్లీ యాక్షన్ లోకి హైడ్రా..



హైదరాబాద్, జూలై 1, హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో మధురానగర్ మెట్రో స్టేషన్ దగ్గరలోని ఆక్రమిత పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 60 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాయి సారథినగర్ వాసులకు ఇది నిజంగా శుభవార్త. 1533 గజాల స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి విడిపించి, ప్రజలకు అంకితం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడ మధురానగర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో దశాబ్దాలుగా ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇది సాయి సారథినగర్ నివాసితులకు 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి శుభప్రదం పలికింది. 1533 గజాల విస్తీర్ణంలోని ఈ పార్కు ఇప్పుడు స్థానిక ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ భూమి ఆక్రమణకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. 1961లో సాయి సారథినగర్ పేరుతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 35 ప్లాట్లతో ఒక లేఅవుట్ను రూపొందించారు. ఈ లేఅవుట్ ప్లాన్‌లో 1533 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే.. లేఅవుట్ నిర్మించిన నారాయణ ప్రసాద్ వారసులు ఈ పార్కు స్థలంలో షెడ్డు వేసి ఆక్రమించుకున్నారు. అంతేకాకుండా.. వ్యవస్థలను ప్రభావితం చేసి, ఇంటి నంబర్ కూడా పొందినట్లు విచారణలో వెల్లడైంది. స్థానికులు పలుమార్లుకి ఫిర్యాదు చేసినప్పటికీ, 60 ఏళ్లుగా ఈ ఆక్రమణను తొలగించలేకపోయారు. దీంతో.. సాయి సారథినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ ఆదేశాల మేరకు.. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పార్కు స్థలం ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. ఉదయం హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగి, పార్కు స్థలంలో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ఆ స్థలాన్ని పార్కుగా గుర్తించి, "ప్రొటెక్టెడ్ బై హైడ్రా" అనే బోర్డును ఏర్పాటు చేశారు. దశాబ్దాల తరబడి కొనసాగిన తమ పోరాటం హైడ్రా చొరవతో కేవలం కొద్ది రోజుల్లోనే పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చర్యతో.. ఆ ప్రాంతంలో బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు, ప్రజల జీవన నాణ్యత మెరుగుదలకు హైడ్రా కట్టుబడి ఉందనడంలో సదేహం లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా నిరోధించడానికి హైడ్రా నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రభుత్వాలు, నివాసితుల భాగస్వామ్యంతో పార్కులు, బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేసి, వాటిని కాపాడటం సమాజ ఆరోగ్యానికి, పచ్చదనానికి అత్యవసరం. హైదరాబాద్ లో పాత అపార్ట్ మెంట్లకు డిమాండ్ పెరుగుతుందా? అంటే అవుననే అంటున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం హైదరాబాద్ నగరం పెద్దగా విస్తరించలేదు. అయితే హైదరాబాద్ లో అప్పటికింకా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందలేదు. మూడు దశాబ్దాల క్రితం అప్పుడప్పుడే ఐటీ రంగం ఊపందుకుంటుంది. దీంతోపాటు కార్పొరేట్ సిటీగా హైదరాబాద్ నగరం వృద్ధి చెందుతుందన్ననమ్మకం పెట్టుబడి దారుల్లో కలిగింది. అప్పటికే కేంద్ర ప్రభుత్వంలో నడిచే అనేక పరిశ్రమలు ఉన్నాయి. దీనికి తోడు మెడికల్ రంగానికి అడుగులు పడటంతో అపార్ట్ మెంట్ల సంస్కృతి విస్తరించింది. 1980వ దశకంలో అపార్ట్ మెంట్లు ప్రారంభమయినప్పటికీ 1990 నాటికి కొంత అపార్ట్ మెంట్లు ఊపందుకున్నాయి. అప్పట్లో నగరం విస్తరించకపోవడంతో పాత అపార్ట్ మెంట్లన్నీ ఇప్పుడు నగరం నడి బొడ్డున ఉన్నాయి. ఆబిడ్స్, లక్డీకాపూల్, అమీర్ పేట్ వంటి ప్రాంతాలతో పాటు తర్వాత ఐటీ రంగం బూమ్ తో ఏర్పడిన మాదాపూర్ లో కూడా అపార్ట్ మెంట్లు వెలిశాయి. అయితేఅప్పట్లో కొన్నిబడా సంస్థలు మాత్రమే అపార్ట్ మెంట్లు నిర్మించేవి. ఎక్కువగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టేవి. అప్పటికింకా ట్రిపుల్ బెడ్ రూమ్ ల సంస్కృతి రాలేదు. ఎక్కువగా సింగిల్, డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. అయితే అవి ఇప్పటికి పాత బడిపోయాయి. కానీ వాటి విలువ ఏ మాత్రం తగ్గలేదంటారు రియల్ నిపుణులు. ఆ అపార్ట్ మెంట్ ను కూల్చి తిరిగి నిర్మాణం చేపట్టి ఫ్లాట్ యజమానులకు కొత్తవి నిర్మించి ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారు. నిర్మాణ వ్యయం మాత్రం తామే భరిస్తామని అనేక మంది ముందుకు వస్తున్నారు. నాడు ఐదు నుంచి పది లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఫ్లాట్లు ఒక సంవత్సరం నిర్మాణానికి వదిలేసినా తమ ఫ్లాట్ విలువ కోటి రూపాయలకుపైగానే పలుకుతుందని కొందరు అంగీకరిస్తున్నారు. అంతే కాదు కొత్త ఫ్లాట్ అప్పగించేంత వరకూ అప్పటి వరకూ అద్దెఇంట్లో ఉండాల్సి వస్తే వాటిని కూడా తాము చెల్లిస్తామని బిల్డర్లుముందుకు వస్తున్నారని అంటున్నారు. రీ కన్‌స్ట్రక్షన్స్ ఇప్పుడు చాలా చోట్ల ప్రారంభయ్యాయని, పాత భవనంలో లీకేజీలు కూడా వస్తుండటంతో ఫ్లాట్ల యజమానులు కూడా ఎగిరి గంతేసి సంతకాలు పెడుతున్నారట. ఓల్డ్ అపార్ట్ మెంట్లకు ఇప్పుడు గిరాకీ పెరగడానికి కారణం అదే. స్థలం విలువ పెరగడంతో బిల్డర్ల దృష్టి వీటిపై పడిందంటున్నారు. సో.. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటే ఇదేనేమో.

# గౌడన్లలో మునుగుతున్న ఖరీఫ్ ధాన్యం


అదిలాబాద్, జూలై 1, మంచిర్యాల జిల్లాలో 2024 వానా కాలం సీజన్‌కు సంబంధించి మిల్లుల్లో దిగిన సీఎంఆర్ ధాన్యం ఉందో..! లేదో..! తెలుసుకునేందుకు సివిల్ సప్లయ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలిచ్చారు. వారం రోజుల్లోపు వానా కాలం సీజన్‌లో జిల్లాలోని 30 మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని తనిఖీ చేయనున్నారు. ఈ తనిఖీలతోనే మిల్లుల్లో ధాన్యం ఉందా! లేదా అనేది తేలడంతో పాటు, మిల్లుల్లో ఉన్న ధాన్యం ఆధారంగానే ఉన్నతాధికారులు వానా కాలం సీజన్ సీఎంఆర్‌కు ఎక్స్ టెన్షన్ ఇచ్చే అవకాశం ఉంటుంది. తనిఖీల అనంతరం భయటపడనుందిజిల్లాలోని 30 మిల్లుల్లో ఎఫ్సీఐ అధికారులతో పాటు పౌరసరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ సభ్యులు జాయింట్ ఫిజికల్ వెరిఫికేషన్ (జేపీవీ) చేయనున్నారు. సివిల్ సప్లయ్ కమిషనర్ ముజామ్మిల్ ఖాన్ నుంచి అందిన ఆదేశాల మేరకు ఈ నెల ఆరవ తేదీలోపు తనిఖీలు చేసి నివేధికను ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉంటుంది. నివేధిక ఆధారంగానే సీఎంఆర్ పెట్టేందుకు మిల్లర్లకు గడువు ఇవ్వనున్నారు. 2024-వానాకాలానికి సీఎంఆర్ కింద జిల్లాలో 30 బాయిల్డ్, రా రైస్ మిల్లులకు 78,879 మెట్రిక్ టన్నులు కేటాయించారు. మిల్లింగ్ చేసి 53,120 మెట్రిక్ టన్నుల (1832 ఏసీకేల) బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 32,891 మెట్రిక్ టన్నులు (1134 ఏసీకేలు) అందజేశారంటే 62 శాతం సీఎంఆర్ పెట్టినట్టు. ఇంకా 20,229 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేయాల్సి ఉంది. జేపీవీలో మిల్లుల్లో ధాన్యం ఉందో..! లేదో...! ఎంత ధాన్యం షార్టేజీ ఉందో భయటపడనుంది. 30 మిల్లుల్లో సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండాలి కానీ ఇప్పటికే చాలా మిల్లు ల్లో ఖరీఫ్ ధాన్యం మాయమైనట్టు సమాచారం. జేపీవీలో అది నిర్ధారణ కానుందని కొందరు మిల్లర్లే బాహాటంగా చెప్పుకొస్తున్నారు. సివిల్ సప్లయ్ కమిషనరేట్ కార్యాలయం నుంచి జూన్ 28వ తేదీన జిల్లాలోని మిల్లు ల్లో జాయింట్ ఫిజికల్ వెరిఫికేషన్ చేయాల ని ఆదేశాలు వచ్చినా ఇప్పటి వరకు ఇంకా సంబంధిత అధికారులు మొదలే పెట్టలేదు. ఆరు రోజుల్లో 30 మిల్లుల్లో ఉండాల్సిన 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను కౌంటింగ్ సాధ్యపడుతుందా..? మిల్లుల్లో ధాన్యం బస్తాలు కౌంటింగ్ కు అనుకులంగా నిలువ చేసి ఉండవు, ఇలాంటి సమయంలో ధాన్యం అమ్ముకున్న మిల్లర్లు ఈజీగా బయటపడే అవకాశం లేకపోలేదు. మిల్లుల్లో ధాన్యం బస్తాలను కౌంటింగ్ కు అనుకూలంగా ఉంచాలని సంబంధిత శాఖ అధికారులు ఎన్ని సార్లు చెప్పినా ఏ ఒక్క మిల్లులో అలా ఉండవనేది జగమెరిగిన సత్యం. ఇలాంటి తరుణంలో ఆరు రోజుల్లో కౌంటింగ్ తూతూ మంత్రంగానే జరుగనుందా..! వేచి చూడాలి మరి...

# బ్రాహ్మణ పరిషత్ క దారేదీ

హైదరాబాద్, జూలై 1, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరి షత్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. పాలకమండలి రద్దు, పథకాల అమలులో ఆల స్యంతో పేద బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలు మొదలయ్యాయి. దానిలో భాగంగానే అప్పటి ప్రభుత్వం 2017 జనవరి 28న పేద బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ప్రారంభించింది. పరిషత్ ద్వారా పథకాల అమలు, నిర్వహణకు రూ.100కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని బ్రాహ్మణుల అభ్యున్నతికి బలమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలనే సదుద్దేశంతో దాదాపు 17పథకాలకు రూపకల్పన చేశా రు. అందులో బ్రాహ్మణ సమాజానికి చెం దిన వారికి వ్యాపార అవకాశాలను కల్పించడానికి బెస్ట్(తెలంగాణ బ్రాహ్మణ వ్యవ స్థాపకత పథకం-బ్రాహ్మిణ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కీమ్ ఇన్ తెలంగాణ) పథకా న్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రా ష్ట్రంలోని యువ వ్యవస్థాపకులు స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. 'వివేకానంద' పేరుతో విదేశీ విద్యా పథకం, 'శ్రీ రామానుజ' పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, 'వేదహిత' పేరుతో వేద పాఠశాలలకు, వేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ప్రతీ నెల వేద శాస్త్ర పండితులకు గౌరవ వేతనం, ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహం, బ్రాహ్మణ యువతకు పోటీ పరీక్షల శిక్షణ వంటి పథకాలను పొందుపరిచారు. 2023 మే 31న బ్రాహ్మణుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో 10 ఎకరాల విస్తీర్ణంలో విప్రహిత పేరుతో బ్రాహ్మణసదన్ నిర్మించింది. ఈ విప్రహిత బ్రాహ్మణసదన్ వినియోగంలోకి వచ్చింది. రూ.5 లక్షలు అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో చదువుకోవాలనుకుంటే రూ. 20లక్షల ఆర్థిక సాయం అందజేస్తారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధి వ్యాపారాలకు సబ్సిడీతో కూడిన బెస్ట్ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తారు. 2023 ఆగస్టు నుంచి బ్రాహ్మణ పరిషత్ ద్వారా స్కీంల నిర్వహణ అనుకున్నంత లేదని, బ్రాహ్మణ పరిషత్ ద్వారా ఉపా ధి, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం పొందుదామనుకుంటున్న లబ్ధిదారులు తమ అసంతృప్తిని వ్య క్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బెస్ట్, విదేశీ విద్య పథకాలకు 2024-25 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయిస్తే దీనిలో 2025 మార్చిలో రూ. 25 కోట్లు విడుదలయ్యాయి. అయితే విదేశీ పథ కం లబ్ధిదారులకు అందజేసేందుకు రూ.12.50 కోట్లు ఆర్థిక శాఖ క్లియరెన్స్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారుల ఖాతాలో జమచేయకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటివరకూ 788 మంది లబ్ధిపొందగా వీరిలో 350 సంపూర్ణంగా లబ్ధిపొందారని, దీనికోసం దాదాపు రూ.83 కోట్లు పరిషత్ అందజేసిందని అధికారులు అంటున్నారు. అయితే ఇంకా 288 మంది విద్యార్థులకు పరిషత్ ద్వారా ఆర్థిక సాయం అందుకోవాల్సి ఉందని, నిధులు ఎప్పుడు ఇస్తారని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మోతుకూరి రాము ప్రశ్నించారు. బ్రాహ్మణ సామాజికవర్గ విశ్వాసం చూరగొనాలంటే ప్రభుత్వం పరిషత్ కార్యకలాపాలను మరింత వేగంగా, మెరుగైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సామాజిక సంఘాలు, లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యాపథకం, బెస్ట్ పథకాల లబ్ధిదారుల్లో నెలకొన్న ఆందోళన గమనించి వెంటనే నిధుల మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్త పాలకమండలి ఏర్పాటుతో పాటు ఆశించిన స్థాయిలో నిధులు, సంక్షేమ పథకాల అమలు కోసం కొత్త దరఖాస్తులు ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వం మారిన తర్వాత పాలకమండలి రద్దు అయింది. దీంతో పరిషత్ కార్యకలాపాల నిర్వహణ సందేహాస్పదంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. బడ్జెట్ కేటాయింపులు అరకొరగా ఉండటంతో కొత్త దరఖాస్తులను ఆహ్వానించలేని పరిస్థితి నెలకొన్నది. కొంతకాలంగా కార్యకలాపాలు అంతంత మాత్రంగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌ను పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించడం, ఆమెకు చెక్‌పవర్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో బ్రాహ్మసంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. గతంలో పరిషత్ చైర్మన్‌గా కేవీ రమణాచారి పదవీకాలం పూర్తిచేసున్న తర్వాత.. చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు పరిషత్‌కు ప్రభుత్వం కేటాయించింది. మూడు నెలల కాలం గడిచినా దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. అయితే తాజాగా అందిన సమాచారం మేరకు నేడో రేపో తొలివిడతగా రూ. 25కోట్లు నిధుల మంజూరుకు ప్రభు త్వం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేర కు ఎప్పుడైనా నిధుల విడుదలకు ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు.

# చికెన్, మటన్ లను మించిపోయిన కాకర..

అదిలాబాద్, జూలై 1,ఆదిలాబాద్ జిల్లా మార్కెట్ లోకి బోడా కాకర కాయలు తొందరగానే వచ్చేసాయి. ఈ సీజన్ లో బోడ కాకరకాయలకు అధిక డిమాండ్ ఉంది. బోడ కాకరను ఆగాకర.. అడవి కాకర, స్పైని గార్డ్ లేదా జంగ్లీ కరేలా అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా మహారాష్ట్ర ఆదిలాబాద్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఎక్కువగా మరాఠీ భాషను మాట్లాడుతుంటారు కాబట్టి వారి భాషలో బోడ కాకరను "కర్టులే" అని పిలుస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని మార్కెట్లో బోడ కాకర ప్రస్తుతం కిలో ధర రూ.300 కు విక్రయిస్తున్నారు. ఇది చికెన్ ధర కంటే ఎక్కువగా ఉంది. చికెన్ ధర కిలోకు 210 వరకు ఉంది. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ లో బ్రాండ్‌పై దాని ధర ఆధారపడి ఉంటుంది. చాలా మంది ప్రజలు బోడ కాకర అత్యధిక పోషక విలువలు కలిగి ఉంటుందని, ఆరోగ్య ప్రయోజనాల కోసం ఈ సీజన్ లో వచ్చే బోడ కాకరకాయల కూర తినడానికి ఇష్టపడతారు. ప్రకృతి సహజ సిద్ధమైన పోషక విలువలు కలిగిన ఈ బోడ కాకర అడవి రకం (జంగ్లీ కరేలా) అడవులు మరియు వ్యవసాయ క్షేత్రాలలో చాలా అరుదుగా కనిపిస్తుంది. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ముందు మొహమ్మద్ జబీ అనే వ్యక్తి ఈ బోడ కాకరకాయలను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బోడ కాకరకాయల సీజన్ ప్రారంభమైంది. మార్కెట్ లో కిలో ధర రూ.300 ఉందన్నారు. మహారాష్ట్రలోని పాండ్రకవడలోని వ్యవసాయ క్షేత్రాలు మరియు అడవులలో బోడ కాకరను సేకరించే వ్యక్తుల నుండి కొనుగోలు చేసి ఆదిలాబాద్ మార్కెట్ లో విక్రయిస్తున్నారని అన్నారు. దిగుబడి మెరుగుపడినప్పుడు జూలై మరియు ఆగస్టులో ధరలు తగ్గుతాయన్నారు. ఆర్టీసీ డిపో ముందు అరటి పండ్లు కూరగాయలు ఇలా అమ్ముకుంటూ తాను జీవనం కొనసాగిస్తున్నానన్నారు. ప్రతిసారి ఈ సీజన్ లో బోడ కాకరకాయలతో మంచి ఉపాధి ఉంటుందని, ప్రస్తుతం అడవుల్లో గ్రామాల్లో సేకరించి తీసుకువచ్చిన వారి వద్ద బోడ కాకరకాయలను కిలో రూ.260 కి కొనుగోలు చేసి మార్కెట్లో రూ.300 వరకు విక్రయిస్తున్నానని, రోజు కూలి రిత్యా మంచి లాభం ఉందన్నారు. బోడకాకరలను



సేకరించి తీసుకువచ్చే వారికి, మార్కెట్ లో విక్రయించే తమకు ఈ సీజన్ లో మంచి ఉపాధి అన్నారు. బోడ కాకరకాయల్లో పోషక విలువలు కలిగి ఉంటాయని, వీటి విలువ మరియు ఆరోగ్యానికి తగినట్లుగా, ముఖ్యంగా అధిక రక్తపోటు, డయాబెటిస్, ఒబ్సీ టై మరియు ఇతర ఆరోగ్య కాండి-టయ్స్‌లతో బాధపడుతున్న రోగులు, ప్రజలు సాధారణంగా బోడా కాకర కాయల కూరను తింటే ఆరోగ్యం బాగుంటుందని, జీర్ణ క్రియ మెరుగుపడుతుందని, ఈ బోడ కాకరకాయ కూర రుచి చాలా బాగుంటుందని అతి ఇష్టంగా ప్రజలు తింటారు. తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దులోని పేన్ గంగానది పరివాహక ప్రాంతాల్లో ఈ బోడ కాకరకాయలు అత్యధికంగా లభ్యమవుతాయి. పస్సి పార్ధి తెగకు చెందిన వారు వీటిని ఈ సీజన్ లో ఉపాధిగా ఎంచుకుంటారు. అదనంగా, కొంతమంది రోజువారీ వేతన కార్మికులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అడవుల్లో అలాగే ఎక్కువగా బేల, సాత్నాలతో పాటు సరిహద్దులో ఉన్న పాఠన్ బోరీ, మాండ్వికి దగ్గరగా ఉన్న ఉన్కేశ్వర్ సమీపంలో ఉన్న అడవుల నుండి బోడ కాకరకాయలను సేకరిస్తారు. ఈ సీజన్లో పేన్ గంగానది పరివాహక ప్రాంతాల్లో అడవుల్లోకి వెళ్లి ఈ బోడకాకరకాయలను సేకరించి ఆదిలాబాద్ మార్కెట్లోకి తీసుకొచ్చి విక్రయిస్తారు. పోషక విలువలు రుచికరమైనటువంటి ఈ బోడ కాకరకాయల కూర చాలా బాగుంటుందని, ఈ సీజన్లో అత్యధికంగా అందరూ తింటుంటారు. చికెన్ మటన్ కంటే ఎక్కువగా పోషక విలువలు కలిగి ఉండడంతో పాటు ఇది ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, ప్రజలు ఈ సీజన్ లో దొరికే బోడ కాకరకాయలను ఎక్కువగా తింటారు.

# ప్రమాదాలను నివారించలేమా...

మెదక్, జూలై 1, సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో 33మంది కార్మికులు చనిపోయారు. 20 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. తరచూ పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవడం, వాటి వల్ల కార్మికులు చనిపోవడం లేదా తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. అయితే, ఈ పరిశ్రమల్లో ఎందుకు పేలుళ్లు జరుగుతాయన్న అంశాలను ఇప్పుడు పరిశీలిద్దాం. పరిశ్రమల్లో ఉత్పత్తి జరగాలంటే రసాయన పదార్థాలు వాడటం తప్పనిసరి. అందులో కొన్నిసార్లు ప్రమాదకరమైన రసాయనాలు కూడా వాడాల్సిన అవసరం ఉంటుంది. ఈ సందర్భంలో, రసాయన ప్రతిచర్యలు కొన్నిసార్లు నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. అంటే, రియాక్టర్లలో అధిక ఉష్ణోగ్రత, పీడనం పెరిగిపోయి నియంత్రణ కోల్పోయే పరిస్థితులు తలెత్తుతాయి. ఉష్ణాన్ని విడుదల చేసే ప్రతిచర్య సరిగా చల్లబడకపోతే, అవి పేలుడుకు దారితీస్తాయి. కొన్ని సందర్భాల్లో, పరిశ్రమల్లో ప్రమాదకర రసాయన పదార్థాలను వాడాల్సి వస్తుంది. వీటిని కార్మికులు తెలిసీ తెలియక కలిపినా, లేక పొరపాటున రెండు ప్రమాదకర రసాయన పదార్థాలు కలిసినా అవి తీవ్రమైన, వేగంతో ప్రతిచర్యకు దారితీసే ప్రమాదం ఉంది. ఈ ప్రతిచర్యలు పేలుళ్లకు కారణం కావచ్చు. నిపుణులు చెప్పేది ఏంటంటే, కొన్ని రసాయనాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఉదాహరణకు, పెరాక్సైడ్‌లు వంటి రసాయన పదార్థాలు చిన్న మార్పులకు లోనైనా పేలుళ్లకు కారణం కావచ్చు. పరిశ్రమల్లో వినియోగించే రసాయనాల వల్ల, కొన్నిసార్లు ఉత్పత్తికి అవసరమైన వాయువులు వాడే సందర్భంలో ఈ పేలుళ్లు జరగవచ్చు. రసాయన ప్రక్రియ సందర్భంలో పెద్ద ఎత్తున వాయువులు జనించే అవకాశం ఉంది. వాటిని సరైన రీతిలో ఒత్తిడి లేకుండా బయటకు పంపించాల్సి ఉంటుంది. అలా వాటిని సరిగా బయటకు పంపకపోతే, రియాక్టర్లలో తీవ్రమైన ఒత్తిడి పెరిగి భారీ పేలుళ్లు జరిగే అవకాశం ఉంది. పైన చెప్పినవన్నీ రసాయన, వాయు

## నిర్లక్ష్యానికి భారీ మూల్యం...

పదార్థాల ప్రభావంతో జరిగే పేలుళ్లు. వీటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, ఈ ప్రమాదాలు జరగకుండా సంబంధిత యాజమాన్యం పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. ఉద్యోగులకు, కార్మికులకు వీటిపై పూర్తి అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అయితే, మానవ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలు, యంత్రాలలో లోపం, యంత్రాలను సరిగా వినియోగించకపోవడం వల్ల కూడా పేలుళ్లు జరిగే అవకాశం ఉంది. అవేంటో ఇప్పుడు చూద్దాం. పరిశ్రమల్లో వాడే పరికరాల్లో లోపాలు కూడా ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. పాతబడిపోయిన పరికరాలు వాడటం, లేదా వాటి నిర్వహణ సరిగా ఉండకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. రియాక్టర్లు, బాయిలర్లు, పైప్‌లైన్‌లు, స్టోరేజ్ ట్యాంకుల అంతర్గత పీడనం, అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక పేలిపోయే ప్రమాదం ఉంది. లీకేజీలు, తుప్పుపట్టడం, పూర్తిగా అరిగిపోవడం, సరిగా నిర్వహణ పనులు లేక మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల పరికరాలు బలహీనంగా మారి అధిక ఒత్తిడి లేదా ఉష్ణోగ్రత ఏర్పడినప్పుడు అవి పేలిపోతుంటాయని నిపుణులు చెబుతున్నారు. పరిశ్రమల్లో వాడే పంపులు, కంప్రెసర్‌లు, కూలింగ్ సిస్టమ్స్ వంటి కీలక యంత్రాలు సరిగా పనిచేయకపోయినా పేలుళ్లు జరుగుతాయి. ఈ యంత్రాలు సరిగా పని చేయకపోతే నియంత్రణ కోల్పోయి పేలుళ్లు జరిగే అవకాశం ఉంది. వీటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, సరిగా ఉందో లేదో సరి చూసుకోవాల్సి ఉంది. పరిశ్రమల్లో సేఫ్టీ వాల్వ్‌లు అత్యంత కీలకమైనవి. వీటిని బాయిలర్లు, రియాక్టర్లు, ప్రెషర్ వెసెల్స్, పైప్‌లైన్‌లు, రిఫ్రిజిరేషన్ సిస్టమ్స్ వంటి వాటిల్లో పీడనాన్ని తగ్గించేందుకు ఉపయోగిస్తారు. ఇవి అధిక పీడనం వల్ల ఏర్పడే ప్రమాదాల నుండి కార్మికులను, యంత్ర సామగ్రిని కాపాడటానికి ఉపయోగపడతాయి. ఇవి ఫెయిల్ అయితే అధిక పీడనం ఏర్పడి పేలుళ్లు సంభవించే అవకాశం ఉంది. పరిశ్రమలోని బాయిలర్లు, కంప్రెసర్‌లు, కూలింగ్ సిస్టమ్, రియాక్టర్లు వంటి యంత్రాలు గరిష్ట పీడనం ఎంతో అంతవరకు పని చేస్తాయి. అంతకన్నా పీడనం ఎక్కువైతే సేఫ్టీ వాల్వ్ తెరచుకోవాలి. ఇందుకోసం అవసరమైన సెన్సార్‌లు, ఇతర మెకానిజం ఏర్పాట్లతో వీటిని తయారు చేస్తారు. ఇవి ఫెయిల్ అయినప్పుడు ఆ అధిక పీడనం తట్టుకోలేక బాయిలర్లు, రియాక్టర్లు, ఇతర యంత్రాలు వాటి నిర్మాణం ఆ పీడన ఒత్తిడిని తట్టుకోలేక పేలిపోతాయి. పరిశ్రమల్లో విద్యుత్ లోపాల కారణంగా కూడా పేలుళ్లు జరుగుతాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల కొన్నిసార్లు అధిక విద్యుత్ ప్రవాహం జరగవచ్చు. దీని వల్ల వైర్లు కాలిపోయి మంటలు చెలరేగే అవకాశం ఉంది. ఈ మంటలు పక్కనే ఉన్న మండే అవకాశం ఉన్న రసాయన పదార్థాలు, వాయువులు లేదా ఇతర ద్రవాల డ్రమ్ములు అంటుకుని పేలే అవకాశం ఉంది. ఓవర్‌లోడింగ్, వైరింగ్ లోపాలు, పాత వైర్లు వాడటం, విద్యుత్ పరికరాలు ఫెయిల్ అవ్వడం కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

# బనకచర్లకు బ్రేక్...

కర్నూలు, జూలై 1, బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ ప్రభుత్వానికి షాక్ తగిలింది. కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది. అలాగే ఏపీ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. 3000 టీఎంసీల గోదావరి జలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయని.. ఇందులో 200 టీఎంసీలు ఉపయోగించుకునేందుకు ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదించింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్రం షాకిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు నిరాకరించింది. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుపై పలు అభ్యంతరాలు వచ్చాయన్న కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ తీర్పును పరిశీలించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు కావాల్సిన పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నారని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది.బనకచర్ల ప్రాజెక్టు లో నీటి నిల్వపై కేంద్ర ప్రభుత్వంతో అధ్యయనం చేయించడం సహా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన అనుమతులు, పర్యావరణంపై ఏ మేరకు ప్రభావం పడుతుందనే దానిపై అంచనా వేసిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడానికి అవకాశం ఉ ంటుందని కమిటీ వెల్లడించింది. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల ఇవ్వలేమన్న కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలపై కేంద్ర జలసంఘం సాయంతో వరద నీటి లభ్యతపై అధ్యయనం చేయాలని సూచించింది. అలాగే గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల పంపిణీపై సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి తీసుకోవాలని తెలిపింది. సముద్రంలో వృథాగా కలిసే గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించి.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలని ఏపీ ప్రభుత్వం భావించింది. గోదావరి నుంచి 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని.. ఇందులో 200 టీఎంసీల నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఉపయోగించుకుంటే రాయలసీమకు మేలు కలుగుతుందని సీఎం చంద్రబాబు పదే పదే చెప్తున్నారు.ండు రాష్ట్రాలూ ఉపయోగించుకోవాలని చంద్రబాబు సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ. 80,000 కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచించింది.అయితే, తెలంగాణ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్, పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నారని.. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగిస్తుందని అభ్యంతరం తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు నిరాకరించింది.

# వివాదంలో రాయుడు మిలటరీ హోటల్

విశాఖపట్టణం, జూలై 1, విశాఖపట్నం హైవే రోడ్డుపై ఓ మిలిటరీ హోటల్ తిరుమల శ్రీవారి ఆలయ గర్భగుడి నమూనాతో నిర్మించబడి ఉండటమే కాకుండా, జయ ? విజయలు, బంగారు వాకిలి, రాములవారి మెడ, కులశేఖర పడి లాంటి కీలక ప్రాంతాల నమూనాలతో సెట్ వేయడంపై కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్ లో నాన్ వెజ్ వంటలు వడ్డించడంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను కించపరచినట్లు భక్తులు మండిపడుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తిరుమల గర్భాలయ నమూనా.. అది కూడా హోటల్ రూపంలో? తిరుమల శ్రీవారి గర్భాలయం అంటే ప్రతి హిందువు గుండె లోతుల్లో భక్తితో నిలిచే పవిత్ర స్థలం. అలాంటి ఆలయ నమూనాను ఉపయోగించి ఓ హోటల్ నిర్మించడం, అందులో మాంసాహార వంటకాలను వడ్డించడం నిజంగా శ్రద్ధా సంపన్న భక్తుల మనసును కలచివేస్తోందన్నది అసలు ఆరోపణ. ఇది సాధారణ వ్యాపార చర్యగా కాకుండా, భక్తుల మత భావనలపై అవమానకరంగా ఉ ందంటూ భక్తులు మండిపడుతున్నారు. రాయుడు మిలిటరీ హోటల్ విశాఖపట్నం హైవే పక్కనే ఉన్న ఈ హోటల్ పేరు రాయుడు మిలిటరీ హోటల్. హోటల్ నిర్మాణం మొత్తం తిరుమల ఆలయ నిర్మాణ శైలిలోనే తీర్చిదిద్దబడినట్లు వైరల్ అవుతోంది. హోటల్ గేటు వద్ద జయ, విజయల విగ్రహాలు, ఆలయ సుదర్శన చక్రం గుర్తులు, స్వామివారి మెడలో కనిపించే అలంకరణలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తీర్థక్షేత్ర గౌరవాన్ని వ్యాపారానికి వాడకూడదన్నది పలువురి భక్తుల వాదన. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం కేవలం ఆలయం ఒక్కటే కాదని, అది కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక కేంద్రం. అలాంటి గర్భాలయ నమూనాను ఓ మాంసాహార హోటల్ కు ఉపయోగించడమేంటని ప్రశ్నిస్తున్నారూ భక్తులు. ఇది భక్తుల మనోభావాలను గాయపరచడమే కాకుండా, తిరుమల ఆలయం గొప్పతనాన్ని, గౌరవాన్ని తక్కువ చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీటీడీకి ఫిర్యాదు చేసిన కిరణ్ రాయల్ ఈ హోటల్ వ్యవహారాన్ని గుర్తించిన తిరుపతికి చెందిన కిరణ్ రాయల్ అనే భక్తుడు తక్షణమే టీటీడీ ఈఓ, చైర్మన్ లకు ఫిర్యాదు చేశారు. ఫోటోలు, వీడియోలతో సహా పూర్తి సమాచారం అందజేశారు. ఇదే కాకుండా హోటల్ ఎదుట నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. తిరుమల గౌరవాన్ని ఈ స్థాయిలో తక్కువ చేస్తూ ఎవరు వ్యాపారం చేసినా సహించేది లేదని స్పష్టంగా హెచ్చరించారు ఇలా శ్రీవారి గర్భాలయ నమూనాలతో నాన్ వెజ్ హోటళ్లు పెరిగిపోతే ఇది భక్తుల మనోభావాలపై ఘాతుకమే అవుతుంది. దీని పట్ల చర్యలు తీసుకోకపోతే, రాయుడు హోటల్ ఎదుట భక్తులంతా పెద్ద సంఖ్యలో ఆందోళన చేయడానికి సిద్ధం అవుతున్నామని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. ఆయన మాటలకు సోషల్ మీడియాలోను భారీ స్పందన లభిస్తోంది. ఇలాంటి వాటిని అరికట్టడానికి టీటీడీ దృష్టి పెట్టాలని కిరణ్ రాయల్ అభిప్రాయపడుతున్నారు. కిరణ్ రాయల్ చేసిన ఫిర్యాదులో మరో కీలక అంశం ఉందని కొందరు భక్తులు వాదిస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు విజిలెన్స్ స్పెషల్ వింగ్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుమల ఆలయ నమూనాలు, గుర్తులు ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో పర్యవేక్షించే ప్రత్యేక బృందం అవసరం అన్నది ఆయన అభిప్రాయం. మండిపడుతున్న భక్తులు ఈ ఘటనపై సోషల్ మీడియా ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ప్రతిష్ఠను బిజినెస్‌కు వాడుకోవడం ఎంతవరకు న్యాయం? ఇది కేవలం అలంకరణ కాదు.. మతసంబంధిత గౌరవాన్ని తృణప్రాయంగా తీసుకునే చర్య అంటూ స్పందిస్తున్నారు. కొన్ని సంఘాలు ఇప్పటికే హోటల్ మూసివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటివి ఒకసారి తలెత్తితే భవిష్యత్‌లో మరిన్ని ఉదంతాలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందుకే టీటీడీ ఈ విషయంలో తక్షణమే స్పందించి, న్యాయపరంగా, పరిపాలనా పరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. తిరుమల గర్భాలయ నమూనా పేరుతో మాంసాహార హోటల్ నడిపిన వ్యవహారం పునరావృతం కాకుండా.. టీటీడీ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. మొత్తం మీద ఈ విషయంపై టీటీడీ దృష్టి సారించినట్లు సమాచారం. అయితే చివరగా కొసమెరుపు ఏమిటంటే.. భక్తి కొద్ది ఆ నమూనాను తయారు చేసి ఉండవచ్చని, మరికొందరు నెటిజన్స్ హోటల్ యాజమాన్యానికి మద్దతుగా కామెంట్స్ చేయడం విశేషం

# యాక్షన్ లోకి దువ్వాడ శ్రీ వాణి

శ్రీకాకుళం, జూలై 1,శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో దువ్వాడ కుటుంబం పేరు మార్మోగకుండా ఉండదు. కొన్ని నెలల క్రితం వరకూ దువ్వాడ శ్రీనివాస్, ఆయన భార్య దువ్వాడ వాణి, వేరే పక్కన వార్తల్లో నిలిచిన మాధురి.. ఈ ముగ్గురి పేర్ల చుట్టూ నిత్యం చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మాధురితో దువ్వాడ శ్రీనివాస్ పెళ్లి వార్త బయటకు వచ్చాక, దువ్వాడ వాణి ఎమోషనల్‌గా స్పందించి దీక్ష చేపడుతున్నారని అనుకుంటే పొరపాటే. అయితే ఫ్యామిలీ వివాదం సమయంలో వాణి చేసిన మాటలు ఎంత సంచలనంగా మారాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయినా కాలం గడిచింది, రాజకీయాలు నిశ్శబ్దంగా మారాయి. అయితే ఇప్పుడు అదే వాణి.. మళ్లీ ఒక బిగ్ యాక్షన్‌కు సిద్ధమవుతున్నారు. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఇప్పుడు దువ్వాడ



వాణి ఏం చేయబోతున్నారు అంటే.. ఆమె ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నారు. రాజకీయంగా పునరుజ్జీవించేందుకు కాదు, ప్రజాప్రయోజనాల కోసం. టెక్కలి మండలంలోని సర్పంచ్‌ల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, తన నియోజకవర్గ ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె ప్రకటించారు. దివ్వెల మాధురితో దువ్వాడ శ్రీనివాస్ వివాహం జరిగినప్పటికీ, వాణి మాత్రం రాజకీయాల్లో నిలబడటం, పబ్లిక్ ఫోరమ్స్‌లో తన హక్కును వినిపించుకోవడం ఆపలేదు. ఒక మహిళగా, ఒక నాయకురాలిగా ఆమె తన స్థానం కోల్పోకుండా ముందుకెళ్తుండటం గమనార్హం. ప్రస్తుతం వాణి టెక్కలి జెడ్పీటీసీగా కొనసాగుతుండగా, పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే సమయంలో, సర్పంచ్‌లు చేస్తున్న అభివృద్ధి పనులను అధికారులు అడ్డుకుంటున్నారని, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్నారని, నిధులు విడుదల చేయడంలో అన్యాయం జరుగుతోందని, మౌలిక వసతుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఆమె వాదిస్తున్నారు. టెక్కలిలోని ప్రధాన పంచాయతీలో పారిశుద్ధ్యం దారుణంగా ఉందని, 196 హుదూద్ ఇళ్లకు ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్లు లేవని వాపోయారు. ఈ పరిస్థితుల్లో అధికారులు స్పందించకపోతే, తాను టెక్కలిలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. దీనిపై వాణి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టెక్కలి నియోజకవర్గం నుంచే కాక, జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. మరీ ముఖ్యంగా ఆమె గతంలోని వ్యక్తిగత సంఘటనలు.. దువ్వాడ శ్రీనివాస్, మాధురితో వివాహం అంశాలు పక్కన పెట్టుకొని, ఇప్పుడు పూర్తిగా ప్రజాప్రయోజనాల కోసం బాటపడినట్టు కనిపిస్తుండటమే చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నేతలుగా దువ్వాడ శ్రీనివాస్, వాణిలకు గతంలో మంచి ప్రజాదరణ ఉండేది. అయితే వ్యక్తిగత విభేదాల కారణంగా ఇద్దరూ వేర్వేరుగా రాజకీయంగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వాణి తిరిగి రాజకీయంగా పట్టు సాధించేందుకు ప్రజల సమస్యలను ముందుకు తెచ్చి పోరాట పథకంలోకి వెళ్లినట్టు కనిపిస్తోంది. ప్రజలే ఈ వ్యవహారాన్ని ఎలా స్వీకరిస్తారన్నది వేచి చూడాలి. దివ్వెల మాధురితో దువ్వాడ శ్రీనివాస్ పెళ్లి వ్యవహారం వల్ల రాజకీయంగా ఆమె నష్టపోయారా? లేక అదే సంఘటన ఆమెను మరింత బలంగా మార్చిందా? అన్న ప్రశ్నలకు సమాధానం ఈ ఆమరణ దీక్షతో తేలే అవకాశం ఉంది. ఒకవేళ వాణి దీక్షతో ఏదైనా సమస్య పరిష్కార దిశలో కదలిక వస్తే, అది ఆమెకు రాజకీయంగా మరింత ఊపిరిగా మారనుంది

# కొత్త ఎమ్మెల్యేలకు ఫుల్ క్లాస్

విజయవాడ, జూలై 1, రాబోయే 2029 ఎన్నికలకు టీడీపీ ఇప్పుటి నుంచే రెడీ అవుతోందా? పదే పదే నేతలతో సమావేశాలు అందుకేనా? ఓ వైపు సర్వేలు.. మరోవైపు సమావేశాలు పెట్టి హెచ్చరికల వెనుక కారణం అదేనా? కొందరు నేతలు తీరు మారడం లేదా? అందులో పాతవారితోపాటు కొత్తవారు ఉన్నారా? పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన సమావేశానికి 56 మంది డుమ్మా కొట్టడంపై ఆయా నేతలు సీఎం చంద్రబాబు లిస్టులో ఉన్నట్టేనా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం.. సాయంత్రం 6 గంటలకు సాగింది. ఏడాది పాలన గురించి నేతలు, కార్యకర్తలకు వివరిస్తూనే.. అమలు చేసినవాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యర్థుల వ్యూహాలు.. గతంలో జరిగిన కొన్ని పరిణామాలను వివరించారు. సుమారు రెండు గంటలు మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు చురకలు అంటించారు. రాబోయే రెండు, మూడు దశాబ్దాల నాటికి అవసరమైన నాయకత్వాన్ని తీసుకురావాలనే ఆలోచనతో అవకాశం ఇచ్చానని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పని చేయకుండా సలహాలకే పరిమితమైన ఎమ్మెల్యేలు రాబోయేది కష్టకాలమని స్పష్టంగా చెప్పేశారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి మద్దతు ఉన్నవారికే పదవులైనా, టికెట్లయినా ఇస్తామని మరోసారి క్లారిటీ ఇచ్చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని తెలిపారు. సర్వేలను విశ్లేషించి బేరీజు వేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. రోజుకు నలుగురు ఎమ్మెల్యేలతో వన్ టు వన్ మాట్లాడుతున్నానని వెల్లడించారు. మీరు చెప్పింది వింటానని, తాను సలహాలు ఇస్తానని అన్నారు సీఎం చంద్రబాబు. నేతలు మారితే ఓకేనని.. మారకుంటే ఆ విధంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని కాస్త నవ్వుతూ సున్నితంగా హెచ్చరించారు. ఎలాంటి మొహమాటానికి తావు లేదని తేల్చి చెప్పేశారు. కేవలం ఎమ్మెల్యేలకు మాత్రమేకాదని, సొంత నియోజకవర్గంలో ఎవరు తప్పుచేసినా పక్కన పెడతానని అన్నారు. ఇప్పుడు గెలిచిన వాళ్లు మళ్లీ మళ్లీ గెలవాలన్నదే నా ఆశ అని, పార్టీలో నేతలంతా ఆ విధంగా ఆలోచన చేయాలని సూచన చేశారు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా వద్దని, గత ఎన్నికల్లో ఎక్కువ ఖర్చు పెట్టిన వాళ్లు కేవలం 11 సీట్లకు పరిమితమయ్యారని గుర్తు చేశారు. సమావేశానికి గైర్హాజరు కావడానికి కారణాలు తెలుసుకున్నారు అధినేత చంద్రబాబు. కొందరు విదేశీ పర్యటనలని చెప్పారు. మరికొందరు దేవుడి దర్శనానికి వెళ్తున్నామని సమాధానం ఇచ్చారని వివరించారు. నేతలు నియోజకవర్గాల ప్రజలకు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఆహ్వానితుల్లో 56 మంది హాజరుకాలేక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు. ఆదివారం సమావేశానికి ఎంతమంది వచ్చారు? సంతకాలు పెట్టి ఎంతమంది వెళ్లారు? చివరివరకు ఎంతమంది ఉన్నారో తన వద్ద జాబితా ఉందని హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాలకు రానివారు నియోజకవర్గాల్లో ఏం తిరుగుతారు? ఏం పని చేస్తారని మండిపడ్డారు. మొత్తానికి కొందరు నేతలకు అధినేత రెండో హెచ్చరిక ఇచ్చారని అంటున్నారు.

# పొలిటికల్ కేసు స్టడీగా రావెల స్టోరీ



గుంటూరు, జూలై 1, ఆంధ్రప్రదేశ్ లో 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి అనేక మంది కొత్త వారు ఎన్నికయ్యారు. దాదాపు ఎనభై మందికి పైగా ఫస్ట్ టైం ఎమ్మెల్యేగా గెలిచిన వారున్నారు. అయితే వీరు మాజీ మంత్రి రావెల కిశోర్ బాబును చూసి నేర్చుకోవాలి. అలాగే తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన వారు సయితం రావెల కిశోర్ బాబును చూసి తమ నడవడికను మార్చుకోవాలి. ఎందుకంటే రావెల కిశోర్ బాబు రాజకీయ జీవితం కొత్తతరం నేతలకు ఒక పాఠంగా చెప్పొచ్చు. ఎలా ఉండకూడదో ఆయనను చూసి నేర్చుకోవాలి. గెలుపు తర్వాత గర్వం తలెకెక్కితే రావెలకు పట్టిన గతి భవిష్యత్ లో పట్టక తప్పదన్నది ఆయనను చూసి నేర్చుకోవాలి. 2014లో రావెల కిశోర్ బాబు రాజకీయ రంగంలోకి కాలు మోపారు. మచి టైం చూసుకుని ఐఆర్ఎస్ అధికారిగా ఉన్నప్పటికీ సామాజికవర్గం కోణంలో రావడంతోనే తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్తిపాడు టిక్కెట్ ను కొట్టేశారు. తొలి ఎన్నికలోనే గెలుపు రుచి చూశాడు. దానికి తోడు ఐఆర్ఎస్ మాజీ అధికారి కావడంతో 2014మంత్రివర్గంలో చంద్రబాబు రావెల కిశోర్ బాబుకు తన కేబినెట్ లో చోటు కల్పించారు. కుదురుగా ఉండాల్సిన రావెల గెలుపు తర్వాత మైండ్ సెట్ మారిపోయింది. ఇక నియోజకవర్గంలో తనకు తిరుగు లేదని భావించారు. కార్యకర్తలు తన వెంట తిరుగుతుండటాన్ని బలహీనతగా భావించి కష్టాలను కొని తెచ్చుకున్నారు. ఫలితంగా మంత్రి పదవిని పోగొట్టుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరి మళ్లీ ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి చేరి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. తర్వాత 2022 లలో భారతీయ జనతా పార్టీలో చేరారు. తర్వాత 2024 ఎన్నికలకు ముందు రావెల కిశోర్ బాబు బీజేపీకి రాజీనామాచేసి వైసీపీలో చేరిపోయారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీలో చేరి ఏపీ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. 2024లో వైసీపీ ఓటమి పాలు కావడంతో కొన్నాళ్ల నుంచి ఆయన కనిపించడం లేదు. వైసీపీకి కూడా రాజీనామా చేశారు. ఇలా దాదాపు అన్నిపార్టీలను చుట్టివచ్చిన రావెల కిశోర్ బాబు 2014 లో ఫస్ట్ టైం ఎమ్మెల్యేగా గెలిచిన వేసినతప్పటుడుగులతో ఇప్పటి వరకూతిరిగి కోలేదు. ఆయన కెరీర్ ఫస్ట్ టైం ఎమ్మెల్యేలకు కేస్ స్టడీస్ గా చెప్పాలి.

## కెంగువలో పాఠశాల భవనాలకు ప్రారంభించిన మంత్రి కొండపల్లి

విజయనగరం,విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో, ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పి 4 విదానం లో రౌండ్ టేబుల్ ఇండియా 55 లక్షలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రాథమికోన్నత పాఠశాల భవనాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేసారు . ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ , కెంగువ లో విద్యార్థులు పడుతున్న బాదలు , ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని తాను ఎలాగైనా వారి సమస్య పరిష్కరించాలనే లక్ష్యం తో రౌండ్ టేబుల్ 77 కు చెందిన వ్యక్తులతో మాట్లాడి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు .

# క్వాంటం తో మారనున్న ఏపీ...




విజయవాడ, జూలై 1, క్వాంటం వ్యాలీ.. సిలికాన్ వ్యాలీ తరహాలో ఏపీలో ఒక సరికొత్త సాంకేతిక విప్లవం! చంద్రబాబు నాయుడు ఆలోచనలతో, దేశంలోనే మొదటిసారిగా అమరావతిలో క్వాంటం వ్యాలీ రూపుదిద్దుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, పరిశోధన కేంద్రాలతో, స్టార్టప్‌లతో నిండిన ఈ వ్యాలీ.. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో నిలుపుతుందనడంలో సందేహం లేదు. దీని ద్వారా రాష్ట్రానికి ఎలాంటి లాభాలు చేకూరనున్నాయో చూడాలి.క్వాంటం వ్యాలీ.. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నోట పదే పదే వినిపించే మాట. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీ తయారు చేస్తామని సీఎం చంద్రబాబు పదే పదే చెప్తుంటారు. రాబోయే రోజులన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌వే నంటున్న చంద్రబాబు.. హైదరాబాద్ హైటెక్స్ సిటీ నిర్మాణ సమయంలో ఐటీకి భవిష్యత్తు అని చెప్పానని.. ఇప్పుడు ఏఐదే భవిష్యత్తు అని అంటున్నారు. అప్పట్లో ప్రతి ఇంటికి ఓ ఐటీ ఉద్యోగి అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఓ ఎంట్రపెన్యూయర్, ఓ ఏఐ ఉద్యోగి అని పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే తొలిసారిగా అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2026 జనవరి నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో ఐటీ, ఫార్మా, నిర్మాణ రంగం, వాణిజ్య రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు. టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ సహకారంతో దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ టెక్ పార్కు అమరావతిలో ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఏపీ ప్రభుత్వం ఉంది.భారతదేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ హబ్.. అమరావతి క్వాంటం వ్యాలీ. 2026 జనవరి 1వ తేదీన అమరావతి క్వాంటం వ్యాలీని ప్రారంభించాలని భావిస్తున్నారు. 2031 నాటికి క్వాంటం టెక్నాలజీలో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలపడమే లక్ష్యంగా 6,000 వేల కోట్లతో జాతీయ క్వాంటం మిషన్ ఏర్పాటైంది. అందులో భాగంగానే అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్ పార్కు ఏర్పాటు చేయనున్నారు.అమరావతి క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌లో దేశంలోనే అత్యంత శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్ అయిన.. 156-క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్‌తో పనిచేసే ఎఃఓ క్వాంటం సిస్టమ్ టూ ఏర్పాటు చేయనున్నారు. ఇదే గనుక వాస్తవ రూపం దాల్చితే భారతదేశంలోనే అతిపెద్ద క్వాంటం కంప్యూటర్ కానుంది. ఎల్ అండ్ టీ, ఐబీఎం, టీసీఎస్ సహకారంతో అమరావతి క్వాంటం వ్యాలీ టెక్ పార్కు ఏర్పాటు కానుంది. టీసీఎస్, ఐబీఎం వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమల కోసం ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయనున్నారు.. ఎఅూ సహకారంతో లైఫ్ సైన్సెస్, క్రిప్టోగ్రఫీ, మెటీరియల్స్ సైన్స్, ఎనర్జీ ఆప్టిమైజేషన్ వంటి రంగాలలో క్వాంటం అల్గారిథమ్‌లు, అప్లికేషన్‌లను అభివృద్ధి చేయనున్నారు.అమరావతి క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటింగ్, ఏఐ రీసెర్చ్ కోసం కేంద్రాలు, స్టార్టప్స్, ఐటీ కంపెనీల ఆవిష్కరణల్లో సహకారానికి ఇంక్యుబేషన్ సెంటర్లు, ఏఐ నిపుణుల తయారీకి ట్రైనింగ్ కేంద్రాలు, హైటెక్ ల్యాబ్స్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.అమరావతిలో ఏర్పాటు చేసే క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ ద్వారా.. క్వాంటం రీసెర్చర్స్, సైంటిస్టులు, ఇంజనీర్లను రాష్ట్రానికి ఆకర్షించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అలాగే క్వాంటం రీసెర్చ్, డెవలప్‌మెంట్‌లో దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, ఫైనాన్సియల్ మోడలింగ్, హెల్త్ కేర్, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్‌లో అడ్వాన్స్ క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్లు తీసుకురానుంది.మరోవైపు అమరావతి క్వాంటం వ్యాలీని రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు.

# కొర్రలు ఈ సమస్యలు ఉన్నవారు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు..!!



పస్తుత కాలంలో చాలా మంది జీవన శైలిలో మార్పు కనిపిస్తోంది. ఆహార అలవాట్లు మార్చేసి.. ఆరోగ్యం పైన శ్రద్ధ చూపుతున్నారు. మిల్లెట్లకు ప్రాధాన్యత పెరుగుతోంది. చిరు ధాన్యాల్లో దేనికదే ప్రత్యేకత కలిగి ఉంది. అండు కొర్రలు..వీటినే బ్రౌన్ టాప్ మిల్లెట్స్ అని ఆంగ్లంలో పిలుస్తారు. అండు కొర్రలు మనకు అనేక పోషకాలను అందించడంతోపాటు ఆరోగ్య ప్రయోజనాలు లభించేలా చేస్తాయి. అండు కొర్రలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తులతో పాటుగా ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ప్రయోజనాలు ఉన్నాయి. మిల్లెట్లు.. కొర్రలతో అనేక ఆరోగ్యకరమై ప్రయోజనాలు ఉన్నాయి. అండుకొర్రలను 100 గ్రాములు తింటే మనకు సుమారుగా 300 క్యాలరీల మేర శక్తి లభిస్తుంది. అండుకొర్రల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఇది జీర్ణక్రియను పెంపొందిస్తుంది. పేగుల్లో మలం కదలికలను నియంత్రిస్తుంది. దీంతో మలబద్దకం తగ్గిపోతుంది. అండుకొర్రలను తినడం వల్ల జీర్ణ వ్యవస్థలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. జీర్ణ వ్యవస్థ మొత్తం శుభ్రంగా మారుతుంది. అండు కొర్రల్లో గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ కూడా చాలా తక్కువ. అందువల్ల అండుకొర్రలను తింటే షుగర్ లెవల్స్ పెరగవు. డయాబెటిస్ ఉన్నవారు అండుకొర్రలను తీసుకోవటం ద్వారా మేలు జరుగుతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఖనీలివతీవట ః ఇక, అండుకొర్రలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. వీటిల్లో ఉండే మెగ్నిషియం, పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరిగేలా చేస్తాయి. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అండు కొర్రల్లో క్యాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నిషియం అధికంగా ఉండడం వల్ల ఇవి ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా చూస్తాయి. క్యాన్సర్ల నుంచి రక్షణను అందిస్తాయి. ఇలా మిల్లెట్లు.. అండకొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే పలు అనారోగ్య సమస్యల నుంచి బయట పడే అవకాశం ఉంటుంది.

# రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోకుంటే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే!

నిద్రలేమి.. ఇప్పుడు చాలామంది ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య. ప్రతీ ఒక్కరూ ప్రతీరోజూ రాత్రి కనీసం ఏడు గంటల నుండి ఎనిమిది గంటల పాటు అయినా నిద్ర పోవాలి. అయితే నిద్ర లేకపోవటం కారణంగా అనేక ఇతర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా జీవన శైలి వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. నిద్రలేమి సమస్య దైనందిన జీవితంపై చాలా తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. నిద్రలేమితో జీవనశైలి వ్యాధులు ఎవరైతే నిద్రలేమి సమస్యతో బాధ పడుతున్నారో వారు మధుమేహం, రక్తపోటు వంటి ఇతర అనారోగ్య సమస్యలను ప్రమాదాన్ని కలిగి ఉంటారు. నిద్రలేమి కారణంగా శరీరంలో ఇన్సులిన్ నియంత్రణా సామర్థ్యం ప్రభావితం అవుతుంది. ఇది మధుమేహానికి దారి తీస్తుంది. ఇది రక్తపోటును కూడా పెంచుతుంది. ఈ అధ్యయనం ప్రకారం 30% భారతీయులలో పెద్దవారు నిద్ర రుగ్మతలతో బాధపడుతున్నారు. ఇవి వారిలో ఈ ఆరోగ్య సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయని చెప్తున్నారు.




ఈ కారణాలతోనే నిద్రలేమి నిద్రలేమి సాధారణంగా ఒత్తిడి, విపరీతమైన పని గంటలు మరియు అధిక స్క్రీన్ సమయం వలన కూడా కలుగుతుంది. ఈ అంశాలు శరీరంలోని సహజ నిద్ర చక్రాన్ని భంగం చేస్తాయి. నిద్రలేమి కారణంగా దైనందిన జీవితం ప్రభావితం అవుతుంది. ప్రొడక్టివిటీ తగ్గుతుంది. అందుకే నిద్రలేమి సమస్యను అధిగమించటం కోసం నిద్రకు ముందు స్క్రీన్ సమయం తగ్గించుకోవాలి. అలాగే జీవితంలో ఒత్తిడిని, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ను చేసుకోవాలి. నిద్రలేమి తగ్గించుకోటానికి ఇలా చెయ్యండి ప్రతి రాత్రి ప్రతీ ఒక్కరూ ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్ర పోయేలా ప్లాన్ చేసుకోవాలి. నిద్ర పోయే ముందు కాసేపు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు మెడిటేషన్ వంటిది చేస్తే ఇంకా మంచిది. సాధారణ వ్యాయామం మరియు సమతుల్య ఆహారం కూడా ఒత్తిడిని నిర్వహించడంలో, నిద్రను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిద్రలేమి కారణంగా వచ్చే జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి దోహదం చేస్తుంది. నిద్రలేమి సమస్యను పరిష్కరించకుంటే ప్రమాదంలో ఆరోగ్యం ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా నిద్రకు చాలా ముఖ్యమైన స్థానం ఉంది. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి. నిద్రలేమి కారణాలను అర్థం చేసుకోవడంతో పాటు, నిద్రలేమి సమస్యలను పరిష్కరించటం ద్వారా వ్యక్తులు మెరుగైన జీవన విధానం వైపు అడుగులు వేస్తారు. లేదంటే నిద్రలేమి సమస్య జీవితంలో భయంకరమైన జీవనశైలి వ్యాధులకు కారణంగా మారుతుంది. మన ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది.

# ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్ల పరిధిపై తెలంగాణ డెంటల్ కౌన్సిల్ స్పష్టత

ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్‌ల (ాఓఈూ) వృత్తి పరిధికి సంబంధించి ప్రజలకు తెలంగాణ డెంటల్ కౌన్సిల్ అవగాహన కల్పిస్తోంది. ఫేషియల్ సౌందర్య ప్రక్రియలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయటానికి ఓరల్,మాక్సిలోఫేషియల్ సర్జన్‌లకు అర్హత ఉంటుందని కౌన్సిల్ స్పష్టం చేస్తోంది. మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్) కోర్సు రెగ్యులేషన్స్ (3వ సవరణ)కు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేసిన సవరణల ఆధారంగా తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. డీసీఐ చేసిన సవరణలను నోటిఫికేషన్ నం. ఆఇ-87(3)-2019 ద్వారా 2019 ఆగస్టు 26 న భారతదేశ గెజిట్‌లో ప్రచురించడం జరిగింది. డీసీఐ నిబంధనల ప్రకారం, ఓరల్-మాక్సిలోఫేషియల్ సర్జన్లు అనేక రకాలైన ప్రక్రియలను నిర్వహించడానికి శిక్షణ పొందుతారు. వీటిలో: -మైనర్ ఓరల్ సర్జరీలు. -సాఫ్ట్ టిష్యూ గాయాలు, పగుళ్లు, తుపాకీ గాయాలు, యుద్ధ గాయాలు, తల, మెడ ప్రాంతంలోని క్యాన్సర్‌లకు చేసే శస్త్రచికిత్సలు. -క్రానియోఫేషియల్ సర్జరీ. -దవడలు, ముఖంలో సౌందర్య లోపాలను శస్త్రచికిత్స ద్వారా సరిచేయడం. -చర్మపు గ్రాఫ్ట్ హార్వెస్టింగ్. -నడుం, పక్కటెముక, పుర్రె, దిగువ కాలు ఎముక గ్రాఫ్ట్ హార్వెస్టింగ్ సర్జరీలు. -దవడ కీలు సర్జరీ. -ముక్కు రూపాన్ని, లోపాలను సరిచేసే సర్జరీలు. -పుర్రె బేస్ సర్జరీలు: కొవిడ్19 మహమ్మారి వ్యాపించిన సమయంలో బ్లాక్ ఫంగస్ (మ్యూకోర్మైకోసిస్) ఇన్ఫెక్షన్లను తొలగించి ప్రాణాలను రక్షించడంలో మాక్సిలోఫేషియల్ సర్జన్లు కీలక పాత్ర పోషించారు. -మాక్సిలోఫేషియల్ ప్రాంతంలో న్యూరాలజికల్ సమస్యలు. -ట్రాకియోస్టోమీలు నిర్వహించడం. -గాయాల లేజర్ సర్జరీ, క్రయోసర్జరీ. -సౌందర్య ముఖ శస్త్రచికిత్స : ముఖ చర్మం, అంతర్లీన ముఖ కండరాలు, ఎముక, కనురెప్పలు, బాహ్య చెవికి సంబంధించిన చికిత్సలు. మొటిమల మచ్చలు, ఫేస్‌లిఫ్ట్, బ్లెఫారోప్లాస్టీ, ఓటోప్లాస్టీ, ఫేషియల్ బోన్ రీకాంటౌరింగ్ మొదలైన వాటికి చేసే శస్త్రచికిత్సలు. ంశ్రీబనీ ఖీవజీట "గుండెపోటు రావటానికి ముందు ఆడ,మగవారి ముఖంలో ఈ మార్పులు" అలాగే సౌందర్య, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియల కోసం ఓఎంఎఫ్ఎస్ నిపుణుల అర్హతను ధృవీకరిస్తూ డీసీఐ కూడా పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. అర్హత కలిగిన ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్లు క్రానియోమాక్సిలోఫేషియల్ ప్రాంతంలో సౌందర్య శస్త్రచికిత్సా విధానాలను నిర్వహించగలరని ధృవీకరించింది."హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్"ను ఎండీఎస్-ఓరల్ మాక్సిలోఫేషియల్ సర్జరీ పాఠ్యాంశాలలో భాగంగా చేర్చాలని బెంగళూరులోని రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు సూచించింది. ఓఎంఎఫ్ఎస్ ప్రాక్టీషనర్లు సౌందర్య, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియలను చేపట్టడానికి మార్గదర్శకాలను జారీ చేసింది. వారి అర్హతలు, సామర్థ్యాలను పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో డీసీఐ ప్రమాణాల ప్రకారం శిక్షణ పొందిన, సరిగ్గా నమోదు చేసుకున్న ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్లు ముఖ సౌందర్య ప్రక్రియలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను నిర్వహించడానికి పూర్తిగా అర్హులని తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ధ్రువీకరిస్తుంది. ఈ విషయానికి సంబంధించి డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేదా సంబంధిత రాష్ట్ర డెంటల్ కౌన్సిల్స్ మినహా మరే ఇతర సంస్థలు, కౌన్సిల్‌లు లేదా సంస్థల నుండి వచ్చే ప్రకటనలు చూసి ప్రజలు తప్పుదోవ పట్టవద్దని తెలంగాణ డెంటల్ కౌన్సిల్ సూచిస్తోంది. తెలంగాణ డెంటల్ కౌన్సిల్ గురించి: తెలంగాణ డెంటల్ కౌన్సిల్ అనేది డెంటిస్ట్స్ చట్టం, 1948 ప్రకారం స్థాపించబడిన ఒక చట్టబద్ధమైన అథారిటీ. తెలంగాణ రాష్ట్రంలో దంత వైద్య నిపుణుల నియంత్రణకు ఇది బాధ్యత వహిస్తుంది.




# గుండెపోటు రావటానికి ముందు ఆడ,మగవారి ముఖంలో ఈ మార్పులు




గుండె పోటు సమస్య ఇప్పుడు అత్యంత తీవ్రమైన సమస్యగా మారుతుంది. గుండెపోటు బారిన పడి చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే ఈ సమస్య రావడానికి ముందు కొన్ని లక్షణాలను చూపిస్తుంది. గుండెపోటును గుర్తించడం సమయానికి వైద్య జోక్యానికి కీలకం కావచ్చు. గుండెపోటుకు ఛాతి నొప్పి సాధారణ లక్షణం అయినప్పటికీ, మరికొన్ని సంకేతాలు కూడా గుండెపోటుకు కారణం కావచ్చు. పురుషులలో గుండెపోటుకు ముందు ముఖంలో కనిపించే సంకేతాలు పురుషులు మరియు మహిళలు ఇద్దరూ గుండెపోటు సమయంలో కొన్ని ముఖ సంకేతాలను కలిగి ఉంటారు. ఈ సూచనలను అర్థం చేసుకోవడం ద్వారా త్వరితగతిన వైద్య సహాయం పొందడంలో ఇది దోహదం చేస్తుంది. పురుషులలో గుండెపోటుకు ముందు ముఖ సంకేతాలు కొన్ని గుండెపోటును గుర్తించటంలో దోహదం చేస్తాయి. పురుషుల ముఖం అలసిపోయినట్టు శారీరక శ్రమ ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. ముఖంలో ఈ లక్షణాలు ఉంటే గుండెపోటు రావటం ఖాయం ముఖంపై చెమట పట్టడం కనిపిస్తుంది. ఈ అకస్మాత్తుగా వచ్చే చెమట గుండెపోటుకు సంకేతంగా చెప్పవచ్చు. పసుపు లేదా బూడిద రంగు రంగుతో ముఖం పాలిపోయినట్లుగా ఉండవచ్చు. కొంతమంది పురుషులు కళ్ల చుట్టూ లేదా పెదవుల చుట్టూ వాపు గమనించవచ్చు. ఇది గుండె సమస్యను సూచించవచ్చు. మహిళలలో గుండెపోటు ముందు ముఖంలో ఈ లక్షణాలు మహిళలు పురుషులతో పోలిస్తే భిన్నమైన ముఖ లక్షణాలను కలిగి ఉంటారు. వారు మెడ లేదా భుజాల నుండి వ్యాపించే దవడ నొప్పిని కలిగి ఉంటారు. ఈ అసౌకర్యం తరచుగా దంత సమస్యలుగా కూడా కనిపించవచ్చు కానీ దవడ నుండి తీవ్రంగా మారుతుంది. మహిళలు కళ్ల చుట్టూ లేదా చెంపల చుట్టూ వాపు కలిగి ఉండవచ్చు. మహిళలలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మలబద్ధకం, తలనొప్పి వంటి సంకేతాలు గుండెపోటుకు లక్షణాలుగా చెప్పవచ్చు. ఈ లక్షణాలు ముఖంలో కనిపిస్తే జాగ్రత్త ఇవి మాత్రమే కాక వీపు, మెడ, దవడ, కడుపులో నొప్పి వంటి లక్షణాలు, కళ్ళు, ముఖం, కాళ్ళు వాపు, తల తిరగడం వంటి లక్షణాలు కూడా గుండెపోటు ముందు కనిపించే లక్షణాలుగా చెప్పవచ్చు. ఈ లక్షణాలు గనుక ఉంటే ప్రారంభ హెచ్చరికలు గా గుర్తించి జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

# ఒంటరితనం కోరుకుంటున్న మహిళలు ..ఎందుకో తెలుసా..?

గతంలో వివాహం, కుటుంబం లేకుండా జీవితాన్ని ఊహించుక డం కూడా కష్టం. కానీ ఆధునిక సమాజంలో, ముఖ్యంగా మహిళల్లో, ఈ ఆలోచనలో గణనీయమైన మార్పు వస్తోంది. ప్రస్తుత కాలంలో చాలా మంది మహిళలు వైవాహిక బంధం కంటే ఒంటరి జీవితమే మేలు అని భావిస్తున్నారు. ఈ ట్రెండ్ రోజురోజుకు పెరుగుతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా, నేటి మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటున్నారు. వారి కెరీర్‌కు ప్రాధాన్యత ఇస్తూ, తమ కలలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వివాహం అనేది తమ స్వేచ్ఛకు, వ్యక్తిగత ఎదుగుదలకు అడ్డుగా మారవచ్చని వారు భావిస్తున్నారు. '



అంతేకాకుండా, వివాహ సంబంధాలలో ఎదురయ్యే ఒత్తిళ్లు, సర్దుబాట్లు, గొడవలు చాలా మందికి అలసటను కలిగిస్తున్నాయి. అత్తమామల సమస్యలు, నిరంతరం అంచనాలతో కూడిన జీవితం, గృహ హింస వంటివి వివాహంపై వారి నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఒంటరిగా ఉండటం వల్ల తమ ఇష్టానుసారం జీవించవచ్చని, తమ సమయాన్ని, శక్తిని తమ కోసం ఉపయోగించుకోవచ్చని వారు నమ్ముతున్నారు. సామాజిక నిబంధనలు మారుతున్న ఈ కాలంలో, ఒంటరి మహిళలపై గతంలో ఉన్న ఒత్తిడి తగ్గింది. సంతోషంగా, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి వివాహం తప్పనిసరి కాదనే భావన బలపడుతోంది.




# హిట్ టాక్‌లో కన్నప్ప మూవీ







మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా ఎట్టకేలకు నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కొన్నిసార్లు వాయిదా పడిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ సంపాదించింది. సినిమా బాలేదని అనే వాళ్లు ఉన్నా సరే, ఎక్కువ శాతం మాత్రం సినిమా బాగుందని అంటున్నారు. అయితే ఈ సినిమా టీం మాత్రం ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది. నిజానికి ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులు కూడా థియేటర్లకు వెళ్లి చూడాలనుకుంటున్నారు. చాలామంది చూస్తున్నారు. అయితే ఏకంగా మొదటి రోజే ఇండస్ట్రీ హిట్ కన్నప్ప అంటూ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఒక్క రోజులోనే ఇండస్ట్రీ హిట్ స్టేటస్ సాధించిన ఘనత ఈ సినిమాకే దక్కుతుంది అంటూ సోషల్ మీడియాలో కొందరు ట్రోల్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అప్పటివరకు ఉన్న హిట్ సినిమా రికార్డులను ఈ సినిమా తిరగరాసి అత్యధిక కలెక్షన్లు రాబడితే దాన్ని ఇండస్ట్రీ హిట్ అని అభివర్ణిస్తారు. కానీ మంచు విష్ణు సినిమా టీం ఏమని ఆలోచించిందో తెలియదు, కానీ ఏకంగా రెండవ రోజు ఇలా రికార్డు స్థాయిలో ఇండస్ట్రీ హిట్ పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది.



# పూర్తిస్థాయి దర్శకత్వం వహించలే..


## అప్పుడు నటనను వదిలేస్తానన్న అమీర్




'సితారే జమీన్ పర్' అంటూ ప్రేక్షకుల ముందుకువచ్చి మనసులను కదిలించారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమా విజయం తర్వాత ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అలాగే దర్శకత్వం వైపు వెళ్లకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఆమిర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా 'తారే జమీన్ పర్'. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని ఆయనకు పేరు తెచ్చిన ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వం వహించలేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. 'పూర్తిగా దర్శకుడిగా మారకపోవడానికి ఏకైక కారణం నటనపై నాకున్న ఇష్టమే. ఈ పరిశ్రమలో దర్శకత్వం, నిర్మాణం రెండూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ నేను దర్శకత్వం వైపు వెళ్తే నటన బోరింగ్‌గా అనిపిస్తుంది. బోర్ కొట్టిన పనిని నేను చేయలేను. కాబట్టి నటన మానేస్తాను. 'తారే జమీన్ పర్'కు కూడా అనుకోని పరిస్థితుల్లో దర్శకత్వం వహించాను. అప్పుడు నేనున్న పరిస్థితులు అలా ప్రేరేపించాయి' అని చెప్పారు. ఇక లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తాను నటించేది సూపర్ హీరో సినిమా అని ఆమిర్ తెలిపారు. 'లోకేశ్ ఎంతో ప్రతిభావంతుడు ఆయనతో కలిసి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నాను. ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లడానికి సమయం పడుతుంది. నేను రాజ్‌కుమార్ హిరాణీ సినిమా పూర్తిచేశాక ఇందులో నటిస్తాను. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో దీన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి' అని చెప్పారు. ఇక ఆమిర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సితారే జమీన్ పర్' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కూడా దీన్ని వీక్షించి ప్రశంసించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. మానసిక దివ్యాంగులు తమకున్న సమస్యను అధిగమించి ఎలాంటి విజయాన్ని అందుకున్నారన్నది ఇందులో హృద్యంగా చూపించారు.

# తమ్ముడు చిత్రానికి ఎ సర్టిఫికెట్

టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.




# హరిహరవీరమల్లు

## ఆలస్యం..అభిమానుల్లో అసహనం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్ అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతో చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్స్ట్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.



# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. ఐ. ఏ.ఎస్.,



ఉరవకొండ(విజయ సారథి):ప్రతి ఒక్కరూ విరి విరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.ఐ. ఏ.ఎస్., పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు ఉరవకొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ తిప్పే నాయక్, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మరియు ఉరవకొండ మండల ప్రత్యేక అధికారిణి ఖుష్బూ కటోరీ,తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్ ల లో కలిసి మంగళవారం ఉదయం ఉరవకొండ నియోజకవర్గం,ఉరవకొండ మండలం,వెలిగొండ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం మరియు వెలుగొండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెంచన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ముందుగా వెలుగొండ గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని, జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం వెలుగొండ గ్రామంలోని 2025 జులై నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోషా పెంచన్లు పంపిణీ కార్యక్రమం పాల్గొని, పి. గోవిందరాజులు, జి. సిద్ధప్ప, డి. బొజ్జనులకు డిజేబుల్ పెన్షన్లను, పి. వీణమ్మకు వితంతు పెన్షన్ ను, మరియు పి. సుంకమ్మ, జె. పార్వతమ్మలకు ఓల్డ్ ఏజ్ పెన్షన్లు జిల్లా కలెక్టర్ పంపిణీ పంపిణీ చేశారు. ఇంకా మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వము నుండి ఎలాంటి సహాయం అవసరం కావాలని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో త్రాగునీటికి చాలా ఇబ్బందిగా ఉందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే గ్రామంలో నీటి సమస్య రాకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏ ఈని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రేషన్ షాపు తనిఖీ చేసి ఉమాదేవి అనే మహిళకు రేషన్ బియ్యాన్ని కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం వెలుగొండ గ్రామ పంచాయతీ కి సంభందించి (బృందావనం) చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రం నందు రూ 56,271 తో అదనంగా మూడు చెత్త నింపుటకు తొట్లు నిర్మాణానికి భూమి పూజ చేసి, మొక్కలు నాటారు. ఈ గ్రామంలో లోఎక్కడ కూడా చెట్లు లేవని గ్రామంలోని ప్రజలు అందరు మొక్కలు నాటాలని,మొక్కలు ఎక్కువగా ఉంటే వర్షాలు కురుస్తుయాని,అప్పుడు భూగర్భ జలాలు పెరుగుతాయని,అందుకోసం అందరూ మొక్కలు నాటి వాటి పెరుగుదలకు బాధ్యత తీసుకోవాలని గ్రామస్థులకు జిల్లా కలెక్టర్ చూచించారు.అనంతరం ఉరవకొండ మండల కేంద్రం చేరుకొన తహశీల్దార్ కార్యాలయంలో ని రికార్డు రూమ్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు,నియోజకవర్గం,మండల ప్రత్యేక అధికారులు,తహశీల్దార్, ఎంపిడిఓ,డ్వామా పి డి,ఏ పి ఓ,గ్రామీణ నీటి సరఫరా ఏ ఈ, పంచాయతీ సెక్రటరీ, మండల స్థాయి అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గం మరియు మండల ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటించి మండల స్థాయి అధికారుల తో సమావేశాలు నిర్వహించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వెలిగొండ గ్రామంలో త్రాగు నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా ఏ ఈని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికి సోక్ ఫిట్స్ (ఇంకుడు గుంతలు) పామ్ పాండ్స్ ఏర్పాటు చేయాలని,పెద్ద ఎత్తున మొక్కలునాటించాలని డ్వామా పి డి ని ఆదేశించారు. మండల కేంద్రంలో శానిటేషన్ ప్లాన్ కు సంబందించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని,స్వచ్చంద్ర కు సంబంధించి ప్రపోజల్స్ తయ్యారు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు.అంతకుముందు వెలిగొండ గ్రామం నందు జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈరోజు వెలుగొండ గ్రామంలో పేదలకు సేవ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని,ముందుగా ఈ గ్రామంలో పెంచన్లు పొందుతున్న 5 మంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించి వారికి పింఛన్లు పంపిణీ చేసి వారికి సంక్రాంగా ప్రభుత్వము అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలుసుకొని,ఆ కుటుంబాలకు ఇంకా ఏమైనా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు అర్హులు ఉంటే వాటికి సంబంధించి అధికారుల కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామస్థులతో కలసి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా,త్రాగు నీటి సౌకర్యాలకు సంబంధించి చర్చించడం జరిగిందని,ఈ గ్రామానికి ప్రభుత్వం ద్వారా వచ్చే పనులంటిని సకాలంలో చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ పి ఓ.సుజాత,పంచాయతీ సెక్రటరీ వంశీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,గ్రామ సర్పంచ్ వీరాంజనేయులు, యం పి పి.నరసింహులు, టి డి పి మండల కన్వీనర్ విజయ భాస్కర్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం రాఘవేంద్రపురం, రామచంద్ర నగర్, ఓల్డ్ టౌన్ కాలనీలలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతినెలా 1న ఇంటి వద్దకే పింఛన్లను అందజేస్తున్నామని ఆ పార్టీ నాయకుడు వరదరాజు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందని నాయకులు అశోక్ రెడ్డి, నరసింహ తెలిపారు.

## మంత్రాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం రాఘవేంద్రపురం, రామచంద్ర నగర్, ఓల్డ్ టౌన్ కాలనీలలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతినెలా 1న ఇంటి వద్దకే పింఛన్లను అందజేస్తున్నామని ఆ పార్టీ నాయకుడు వరదరాజు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందని నాయకులు అశోక్ రెడ్డి, నరసింహ తెలిపారు.

## ఆరాధన కార్యక్రమాలపై సమీక్ష

మంత్రాలయం(విజయ సారథి):శ్రీ రాయరు, శ్రీ హెచ్ హెచ్ శ్రీ స్వామిజీల నిత్య ఆశీస్సులతో, మంగళవారం టిటిడి కల్యాణ మంటపంలో ఆరాధన కార్యక్రమానికి సంబంధించి అన్ని స్థానిక ప్రభుత్వ అధికారుల సమావేశం వివిధ విభాగాల అధిపతులందరూ చురుకుగా పాల్గొనడంతో బాగా జరిగింది.మిడియా ఇన్‌చార్జ్ శ్రీ కరణం శ్రీనిధి వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధిపతులు, మఠం అధికారులు మరియు మఠం విభాగ అధిపతులందరినీ స్వాగతించారు.మేనేజర్ శ్రీ ఎస్ కె శ్రీనివాసరావు ఈ సమావేశాన్ని నిర్వహించడం యొక్క ఉద్దేశ్యాన్ని వివరించారు మరియు 08.08.2025 నుండి 14.08.2025 వరకు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన కార్యక్రమం (సప్త రాత్రోత్సవం) విజయవంతంగా నిర్వహించడానికి అన్ని అధికారుల సహకారం, సమన్వయం మరియు పరస్పర అవగాహనను బృంద స్ఫూర్తితో కోరారు.ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సంబంధించి ప్రభావవంతమైన మరియు అర్థవంతమైన చర్చ జరిగింది.శ్రీ రాయర ఆరాధన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి పూర్తి సహకారం అందిస్తామని అందరు అధికారులు హామీ ఇచ్చారు.

## గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### భక్తులు నడిచే 32 కి.మీ. పరిధిలో క్షేత్రస్థాయి సందర్శన, పరిస్థితులపై సమీక్ష

విశాఖపట్నం(విజయ సారథి):ఈ నెల 09, 10వ తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మంగళవారం మధ్యాహ్నం సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, దేవస్థానం, జీవీఎంసీ, పోలీసు అధికారులతో కలిసి వివధ ప్రాంతాల్లో పర్యటించారు. అప్పుఘర్ స్నాన ఘట్టం, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవధార, మురళీనగర్, ప్రహ్లాదపురం, కుమారి కల్యాణ మండపం మీదుగా సింహాచలం తొలి పావంచా వరకు వివిధ ప్రాంతాలను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను సమీక్షించారు. సింహాచలం తొలిపావంచా వద్ద చేపట్టాల్సిన పనులపై, ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## సువరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాలను విజయవంతం చేయండి.

కర్నూలు(విజయ సారథి):తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ఇటీవల జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారనీ, ఇందులో భాగంగానే ఈ నెల 2వ తేది నుండి నెల రోజుల పాటు గతసంవత్సరం పరిపాలనలో ప్రజలకు అందించిన అభివృద్ధి సంక్షేమ కార్యకమాలు, అలాగే వై.సి.పి. అధ్యక్షులు జగన్మోహన్రెడ్డి ఓటమి తర్వాత రాష్ట్రంలో కొనసాగించినటువంటి అరాచకాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించేలా కార్యాచరణను సిద్ధంచేశారనీ, వారి ఆదేశాను సారం రేపటి నుండి జిల్లాలోని అన్ని గ్రామాలలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలుగుదేశంపార్టీ కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు.ఈ రోజు వారు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ సుపరిపాలనకు తొలిఅడుగు కర్నూలు జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశంపార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జీలు, చైర్మన్లు, ఇంటింటికి వెళ్లి సంవత్సర పాలనలో సాధించిన అభివృద్ధి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందనీ ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీకి చెందిన పార్లమెంట్, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులతోపాటు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జీలు, నామినేటెడ్ పదవులలో ఉన్న నాయకులు, అన్ని స్థాయిల కమిటీల నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన యం.పి.టి.సి.లు, సర్పంచులు, కార్పోరేటర్లు, కౌన్సిసలర్లు, పార్టీ అభిమానులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన నాయకులు ప్రజలకు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసినటువంటి అభివృద్ధి ముఖ్యంగా సామాజిక పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, డి.యస్.సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్, ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఉచిత ఇసుక పాలసీ, అన్నా క్యాంటీన్ల పున: ప్రారంభం, తల్లికి వందనం క్రింద ప్రతి విధ్యార్థి తల్లికాతాలో ఒక్కొరికి రూ.13ల చొప్పున జమ చేయడం, వంటి వాటితోపాటు త్వరలో రైతన్నలకు ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యము, నిరుద్యోగబృతి వంటి వాటిని ఆచరణలోకి తీసుకొని రావడం జరుగుతుందన్న విషయాలను ప్రజలకు వివరించాలనీ తెలియజేశారు.అదేవిధంగా వై.యస్. జగన్మోహన్రెడ్డి గత సంవత్సర కాలంగా చేస్తున్న అరాచకాలను ముఖ్యంగా అనంతపురం జిల్లాలో జరిగిన హెలిక్యాప్టర్ సంఘటన, పొదిలిలో మహిళలపై దాడులు, ఇటీవల పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లలో వ్యక్తి మృతి ఇవికాక జగన్ రెచ్చగొటే విధంగా మాట్లాడుతున్న తీరు, వీటన్నింటిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలనీ తెలిపారు.

## అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్.

### రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి టి.జి భరత్



కర్నూలు(విజయ సారథి):కర్నూలు నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళవారం ఉదయం స్టేట్ గెస్ట్ హౌస్ లో మంత్రి టి.జి భరత్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, కర్నూలు తహసిల్దార్ వెంకట రమేష్, అర్బన్ తహసిల్దార్ రవి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విధంగా కర్నూల్లో కూడా పంపిణీ చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. నగరంలోని పంప్ హౌస్ సమీపంలో ఉన్న గూడెం కొట్టాల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు వారికి పట్టాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి వారి పేరు మీద పట్టాలు ఇవ్వటానికి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గతంలో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి స్థలాలు లేవని చాలా మంది తన దృష్టికి తీసుకువచ్చారని.. ఈ వివరాలు తీసుకొని పట్టాలు ఉన్నప్పటికీ స్థలాలు లేని వారికి స్థలాలు చూపించాలని చెప్పారు. అలాగే బుధవారపేట ప్రాంతంలో నివాసితుల వివరాలు తీసుకొని పట్టాలు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. 2014కి ముందు ఈ.తాండ్రపాడులో పట్టాలిచ్చిన ప్రాంతంలో స్థలాలు గుర్తించలేని పరిస్థితి నెలకొందని..ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి టి.జి భరత్ అన్నారు.వెంకటరమణ కాలనీ మున్సిపల్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న నాలుగున్నర ఎకరాల డాటెడ్ ల్యాండ్ పోలీసు వారి దగ్గర నుండి కర్నూలు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల నిమిత్తం తీసుకోవటానికి కావలసిన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఏ,బి,సి క్యాంప్ ల ప్రభుత్వ గృహ సముదాయాల్లో శిథిలావస్థకు చేరిన గృహాలను పూర్తిగా తొలగించి చదును చేయాలని ఆ స్థలాలను ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి అనుకూలంగా మార్చాలని ఆదేశించారు.

## టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు



గతంలో టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి చెప్పుకోలేని పరిస్థితి కారణంగా ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందనీ, దానికి తోడు జగన్మోహన్రెడ్డి అనునిత్యం చేస్తున్న అబద్ధ ప్రచారం వంటివి ఉన్నాయనీ, ప్రస్తుతం అప్రమత్తంగా ఉండి వాటన్నింటిని ప్రజలకు తెలిజెప్పాలనీ కోరారు.

## రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలపై సమావేశం.



మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ ఎస్.కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ అధికారులు, మఠం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఆగస్టులో జరగనున్న రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత, భక్తుల వసతి తదితర అంశాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## నిర్దేశించిన ప్రదేశాలలో వాహనాలను నిలపాలి




మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు పోలీసు, మఠం సిబ్బంది సూచించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలను నిలిపాలని ఎస్ఐ శివాంజల్ సూచించారు. భక్తులు ఆన్లైన్‌లో రూములు బుకింగ్ చేసుకునేటప్పుడు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. దర్శనానికి వచ్చినప్పుడు విలువైన ఆభరణాలు, నగదును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## పేరవరంలో కూటమి నాయకులు చే ఉచిత కంటి వైద్య శిబిరం

ఏలేశ్వరం(విజయ సారథి):కాకినాడ జిల్లా ఏలేశ్వరంమండలం పేరవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రాజమండ్రి బుద్ధుడు ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామటీడీపీ నాయకులు అవసరాల సూర్య ప్రకాష్ రావు (కరణం గారు) బర్ల కృష్ణార్జున ,మోర్త నాగేశ్వరరావు, ములుగు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా పంచాయతి ఉప సర్పంచ్ కర్రీ వీరస్వామి ప్రారంభించారు. ఈ కంటి వైద్య శిబిరంలో దాదాపు 70 మంది వరకు రోగులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 11 మంది క్యాటరేట్ ఆపరేషన్ చేయవలసి వస్తుందని తెలిపారు. ఆసుపత్రి వైద్యులు సజ్జ శ్వేత ఆధ్వర్యం లో కంటి ఆపరేషన్ లు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటుపల్లి రాజబాబు, సీనియర్ ఆప్త మిట్రిస్ట్ వినయ్ మరియు సిబ్బంది, వివేకానంద సేవా సమితి సభ్యులు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జోరు వానలో కూడా ఇంటి వద్దకే పెన్షన్ల అందజేసిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస (విజయం సారధి): ఆమదాలవలస నియోజకవర్గం లోని సరుబుజ్జిలి మండలం లోని మూల సవలాపురం గ్రామం లో ఉదయం ఆరు గంటలకే భారీ వర్షంలో కూడా లబ్ధిదారులు ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా ఆమదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవి కుమార్ గారు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడడం లక్ష్యంగా పనిచేస్తుందని అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం నుండే అవ్వ తాతలకు 3000 రూపాయలు పెన్షన్ 4000 రూపాయలకు, వికలాంగులకు 6000 రూపాయలు కి, శాశ్వత వికలాంగులకు 15000 రూపాయలు పెంచిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాలా సూర్యం గారు, మండల పార్టీ అధ్యక్షులు అంబాల రాంబాబు గారు, జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందా రావు గారు, గ్రామ సర్పంచ్ తర్లాడ రాధాకృష్ణ గారు, సురేంద్ర గారు, పల్లి సురేష్ గారు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి

### రాష్ట్ర మంత్రి టి.జి భరత్

కర్నూలు(విజయ సారథి):ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ముఖ్య సమావేశం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై మంత్రి టి.జి భరత్ వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు మంచి చేయడం ఒక భాగమైతే.. చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం మరొక భాగమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చాక పింఛన్ పెంచి ఇచ్చామని, దేశంలో ఎక్కడా లేని విధంగా తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, అన్నా క్యాంటిన్ల ద్వారా రూ. 5కే భోజనం పెడుతున్నామని, ఏడాదిలోనే తొమ్మిదిన్నర లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఈ కంపెనీల వల్ల రాబోయే రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వార్డుల్లో 250కిపైగా విద్యుత్ పోల్స్ మార్చినట్లు చెప్పారు. ఒకదాని తర్వాత మరొక సమస్య పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం స్థిరంగా కొనసాగితే దేశంలోనే మన రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ క్యాడర్ మొత్తం ఇప్పటి నుండి ఈ కార్యక్రమాన్ని ప్రతి రోజూ చేయాలన్నారు. నాయకుల పనితీరును బట్టి రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీట్లు ఇచ్చే విషయంలో పరిగణలోకి తీసుకోవడం జరుగుతందన్నారు. కష్టపడే వారికి పార్టీలో గౌరవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు ముంతాజ్, సంజీవలక్ష్మి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఒకటవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ







**ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం... మంత్రి టి.జి. భరత్.**



కర్నూలు(విజయ సారథి):రాష్ట్రంలో ఠంచనుగా ప్రతి నెలా ఒకటవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేస్తున్నామని,ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో కి తెస్తున్నాం అని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.మంగళవారం ఉదయం కర్నూలు పట్టణ కె.సి. కెనాల్ ప్రక్కన స్వామి రెడ్డి నగర్ లో పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ కె.యి.వరలక్ష్మి- రూ4000,కె.లక్ష్మీ దేవి-రూ4000,సి.నాగలక్ష్మి-రూ6000,షేక్షావలి రూ6000,మెహబూబ్ భాష-రూ6000,లతీఫ్ ట్రాన్స్ జెండర్-రూ4000 లకు వారి ఇంటి వద్ద కు వెళ్లి చేశారు. వృద్ధాప్య పెన్షన్ 4వేలు,వికలాంగ పెన్షన్లు 6వేలు చొప్పున దాదాపు 35 మందికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అందరి ఇళ్లకు వెళ్లి పెన్షన్లను ఒకటవ తారీఖున మీ దగ్గర కు వచ్చి పంపిణీ చేస్తున్నామని , రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందని , ఒకటవ తారీకు సెలవు ఉంటే ఒక రోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రమంతటా అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే ఆహారం అందిస్తున్నామని తెలియజేశారు. చదువుకుంటున్న పిల్లలకు తల్లికి వందనం అమలు చేసి కుటుంబము లో ఎంతమంది పిల్లలు కలిగి ఉన్నారో అంత మందికి తల్లికి వందనం అమలు చేసి సొమ్మును అందజేస్తున్నామని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచితంగా బస్సు సేవలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు.ఒకే ఇంటిలో తల్లికి వందనం అందుకున్న ఐదు మంది పిల్లలు మరియొక చోట ముగ్గురు పిల్లలు తల్లికి వందనం అందుకున్న వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ గత ప్రభుత్వం కుటుంబంలో కేవలం ఒక విద్యార్థికి మాత్రమే సొమ్ము చెల్లించేదని తెలిపారు.పిల్లలకు యూనిఫారం, పాఠశాల పుస్తకాలు తదితరులు కూడా ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, 16 వార్డు స్థానిక కార్పొరేటర్ శ్రీమతి విజయ కుమారి , 8 వార్డు కార్పొరేటర్ పరమేశ్వర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రూ.200 ఉన్న పింఛన్ ని 4 వేల వరకు చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబే

**బుక్కచర్ల గ్రామంలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**- పింఛన్ దారుని ఇంట్లో టీ చేసి అందరికీ అందించిన ఎమ్మెల్యే సునీత**



అనంతపురం(విజయ సారథి):గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన తేడాను ప్రజలు గమనించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. రాప్తాడు మండలం బుక్కచర్ల గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తూ ప్రతి నెల సచివాలయ సిబ్బంది ఇంటికి వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. 15వేల పింఛన్ అందుకున్న నల్లప్ప ఇంటికి వెళ్లి ఆయన్న పరామర్శించి పింఛన్ అందజేశారు. ఆ తర్వాత అతని ఇంట్లోనే ఎమ్మెల్యే సునీత స్వయంగా టీ చేసి అందరికీ అందజేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు రాధాకృష్ణ పాఠశాల కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చెరువులో విద్యుత్ లైన్ ఉందని చెప్పగా అది మార్చడానికి అనుమతులు, అంచనాలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రెండు వందలు ఉన్న పింఛన్ ను నాలుగు వేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలో పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి 5వేలు మాత్రమే ఇచ్చే వారని.. దానిని 15వేలు చేశారన్నారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే 46వేల 628మందికి ప్రతి నెల 21కోట్ల రూపాయలు పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే తల్లికి వందనం కింద 40కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమ చేశారన్నారు. పిల్లలకు 5కోట్లరూపాయల విలువ చేసే విద్యా కానుక కిట్లు అందజేశామన్నారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. ఈనెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తారని వచ్చే నెలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కూడా అమలవుతుందన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మనం ఏం చేశాం రానున్న రోజుల్లో ఏం చేయబోతున్నాము, ఇంకా ఎవరికైనా పథకాలు అందలేదా వంటి అన్ని అంశాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జాకీ స్థానంలో రేమండ్ ను తీసుకొచ్చామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# బనగానపల్లె వీధుల్లో మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సుడిగాలి పర్యటన









బనగానపల్లి(విజయ సారథి): నేడు బనగానపల్లె పట్టణంలోని పలు వీధుల్లో వివిధ శాఖల ఉన్న ఉన్నతాధికారులను వెంటబెట్టుకుని సుడిగాలి పర్యటన చేసిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రత్యక్షంగా పర్యవేక్షించిన మంత్రి.గోపాల్ నగర్, గర్ల్స్ హై స్కూల్ రోడ్డు, ఖాజీవాడ, ఆస్థానం రోడ్డు , లాల్ మసీదు వీధి, పోలీస్ స్టేషన్ వెనుక వీధులలో పూర్తి అయిన సిమెంట్ రోడ్డు పనులు, మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి.వీధుల్లో అక్కడక్కడ అడ్డంగా ఉన్న మంచి నీటి కుళాయి పైపులను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన మంత్రి.కరెంటు పోల్స్ కు అస్తవ్యస్థంగా వేలాడుతున్న వివిధ రకాల వైర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటిని తొలగించాలంటూ ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని తొలగించి ఆయా సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి.గతేడాది పాలనలో సిమెంట్ రోడ్లు ,డ్రైనేజీ ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో స్థానికంగా ఆయా వీధుల్లో ప్రజల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిగత ప్రభుత్వంకు, ప్రస్తుతం మా కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసం గుర్తించాలంటూ ప్రజలకు సూచించిన మంత్రిగతంలో అపరిశుభ్రంగా, దుర్వాసనతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వీధులు.. నేడు కూటమి ప్రభుత్వంలో అత్యంత సుందరంగా అభివృద్ధికి చిరునామాలుగా మారుతున్న విషయాలను ప్రజలు సైతం గుర్తించడంతో పాటు నాటి విధ్వంస పాలనకు ? నేటి సుపరిపాలనకు మధ్య వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలన్న మంత్రి.

## జిల్లాలో ఉపాధి హామీ ప్రగతి లక్ష్యాలను అధిగమించాలి

**ప్రతి కుటుంబానికి వందరోజుల రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి**

నంద్యాల(విజయ సారథి):జిల్లాలో ఉపాధి హామీ ప్రగతిలో లక్ష్యాలను వందశాతం అధిగమించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను పటిష్టంగా అమలు చేసి లక్ష్యాలలో వందశాతం ప్రగతి సాధించాలని సూచించారు. లేబర్ మొబిలైజేషన్ లో భాగంగా ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటల పెంపకం, లేబర్ టార్గెట్, సరాసరి దినసరి వేతనం, ఫారం పాండ్స్, సోక్ పిట్స్, నాడేప్ కంపోస్ట్ పిట్, కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాలలో మండలాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. వెనుకబడిన మండలాల అధికారులతో కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగతిలో వెనుకబడిన మండలాలు ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎం అండ్ ఇ భాస్కర్ నాయుడు, ఏపీడీలు నరసింహారెడ్డి, సాంబశివరావు, అన్వరా బేగం, కోర్సు డైరెక్టర్లు ఏసుదాస్, పరమేశ్వరుడు, ఇస్మాయిల్, ఏపిఓలు, ఇసిలు, ప్లాంటేషన్ సూపర్వైజర్లు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com